

సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలుస్తోంది. ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తోంది. కూటమి ప్రభుత్వంపై విశ్వాసంతో పెట్టుబడులు పెరుగుతుండగా, వాటి క్రెడిట్‌ను జగన్ తీసుకునే అనైతిక ప్రయత్నం చేస్తున్నారు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


బుధవారం 01.04.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 | సంచిక - 344 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00




# చేనేతలకు 'పవర్ గిఫ్ట్'

## నెరవేరిన మరో యువగళం హామీ

- నేటి నుంచే రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత విద్యుత్ అమలు
- మగ్గాలకు 200, మరమగ్గాలకు 500 యూనిట్లు ఫ్రీ
- ఏడాదికి రూ.150 కోట్లు ఖర్చు చేయనున్న ప్రభుత్వం
- 1,04,488 చేనేత కుటుంబాలకు లబ్ధి
- ఎన్నికల ముందు ఇచ్చిన మరో హామీని నిలబెట్టుకున్న ఎన్డీఏ ప్రభుత్వం
- చేనేతలపై అభిమానాన్ని మరోమారు చాటుకున్న లోకేష్

2 లో..

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** చేనేతలు తమ ఆత్మబంధువులు అని చెప్పే మంత్రి, యువనేత నారా లోకేష్ వారిపై తమ అభిమానాన్ని మరోమారు చాటుకున్నారు. యువగళం పాదయాత్రలో యువనేత నారా లోకేష్ ఇచ్చిన మరో హామీని ప్రజాప్రభుత్వం నెరవేర్చింది. అనంతపురం జిల్లా ధర్మవరం నియోజకవర్గంలో పాదయాత్ర సందర్భంగా చేనేతలు పడుతున్న కష్టాలను చూసిన లోకేష్ చలించిపోయారు. తాము అధికారంలోకి వచ్చాక మగ్గాలు ఉన్న చేనేతలకు ఉచిత విద్యుత్ ఇస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. ఆ మాట మేరకు నేతన్నలకు ఏపీ ప్రభుత్వం తాజాగా గుడ్ న్యూస్ చెప్పింది. చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బుధవారం నుంచే ఈ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది.

లిలిలిలిలి బుధవారం నుంచి చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం అమల్లోకి రానుంది. లక్షలాది మంది చేనేత కళాకారుల కుటుంబాల్లో ఆర్థిక స్థిరత్వాన్ని తీసుకురావడమే లక్ష్యంగా చేపట్టిన ఈ పథకం ద్వారా మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, పవర్ లూమ్‌కు నెలకు 500 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా అందిస్తోంది. విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించి, చేనేత వృత్తికి మరింత అండగా నిలిచేందుకు ప్రజా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

**లక్ష చేనేత కుటుంబాలకు లబ్ధి :** ఉచిత విద్యుత్ పథకం అమలుతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 93,000 మాగ్గాలున్న కుటుంబాలు, 11,488 పవర్ లూమ్ కుటుంబాలు ప్రత్యక్షంగా లబ్ధి పొందనున్నాయి. దీని కోసం ప్రభుత్వం ఏడాదికి దాదాపు రూ.150 కోట్లు వెచ్చించనుంది. ఈ రాయితీ ద్వారా ఒక్కో చేనేత కార్మికుని కుటుంబానికి ఏడాదికి రూ.8,640, అలాగే పవర్ లూమ్ యూనిట్లకు ఏడాదికి రూ.21,600 వరకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది. నేత వృత్తిలో విద్యుత్ ఒక అనివార్య ఖర్చుగా మారిన తరుణంలో, మగ్గాల నిర్వహణ, అల్లిక, డైయింగ్ వంటి పనుల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఈ తోడ్పాటు నేతన్నలకు వెన్నెముకగా నిలవనుంది.

**చేనేతలకు చేదోడుగా... :** గత ప్రభుత్వ హయాంలో సంక్షోభంలో

## నక్సల్స్ లేని నవ భారతం



- నక్సలిజం నిర్మూలనలో మోదీ, అమిత్ షా కృషి ప్రశంసనీయం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలో రెడ్ కారిడర్‌కు ముగింపు పలుకుతూ, మావోయిజాన్ని దాదాపు పూర్తిగా నిర్మూలించడం చారిత్రాత్మక విజయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, ప్రధానమంత్రి మోదీ దృఢ నాయకత్వం, హోంమంత్రి అమిత్ షా కట్టుదిట్టమైన సంకల్పంతో నడిపిన విధానాల ఫలితంగా ఎన్నో ఏళ్లుగా ప్రధాన ప్రవాహ పాలన, అభివృద్ధికి దూరంగా ఉన్న ప్రాంతాల్లో ఎడమచెయ్యి తీవ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించగలిగామని పేర్కొన్నారు. ఒకప్పుడు భయం, హింస, పరిపాలనా లోపాలతో గుర్తింపు పొందిన ప్రాంతాల్లో ఇప్పుడు శాంతి, స్థిరత్వం, అభివృద్ధి పునరుద్ధరించబడుతున్నాయని తెలిపారు. ఇది స్వతంత్ర భారతదేశ అంతర్గత భద్రతా చరిత్రలో ఒక విశేష మైలురాయిగా నిలిచిందని అభివర్ణించారు.

నక్సలిజం వ్యతిరేక చర్యలను వ్యూహాత్మకంగా అమలు చేయడంలో అమిత్ షా చూపిన పట్టుదల, కేంద్రీకృత దృష్టి గత ప్రభుత్వాలకు సాధ్యంకాని ఫలితాలను అందించిందని మాధవ్ కొనియాడారు.

## బీహార్‌లో పెను విషాదం

- ఆలయ తొక్కిసలాటలో 8 మంది మృతి
- ప్రధాని మోదీ దిగ్భ్రాంతి..
- రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన



**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** బీహార్‌లోని నలందా జిల్లా మఘ్రా గ్రామంలో ఉన్న ప్రముఖ దేవాలయం అయిన శీతల మాత ఆలయం లో తొక్కిసలాట జరిగిని ఎనిమిది మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ షాకింగ్ ఘటనతో యావత్ రాష్ట్రం ఉలిక్కిపడింది. చైత్ర మాసం చివరి మంగళవారం కావడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు.

మిగతా 2లో...

## రోడ్డు భద్రతకు 'హైటెక్' నిఘా..



- డ్రైవర్లపై ప్రత్యక్ష పర్యవేక్షణ!
- డ్యాష్‌క్యామ్‌ల ద్వారా కంట్రోల్ రూమ్ నుంచి హెచ్చరికలు.
- త్వరలో 1500 బస్సులకు విస్తరణ
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి.

2 లో

## ప్రతి నియోజకవర్గంలో 'మోడల్ సోలార్ విలేజ్'



- విద్యుత్ రంగం బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం
- నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందరికీ అందాలి
- సూర్యఘర్, కుసుమ్, ఆర్డీఎస్ఎస్ పనులు వేగవంతం చేయండి
- వినియోగదారుల సంతృప్తి స్థాయి 90 శాతానికి పెరగాలి
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్

2 లో

## మేడ్ ఇన్ అమరావతి క్వాంటం హార్డ్ వేర్ లక్ష్యం



- క్వాంటం అప్లికేషన్లతో ఏపీకే తొలి ప్రయోజనాలు
- ఏప్రిల్ 14న దేశంలోనే తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్ రాజధానిలో ప్రారంభం
- క్వాంటం హార్డ్ వేర్ మాన్యుఫాక్చరింగ్ ఎకో సిస్టం రౌండ్ టేబుల్ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాజధాని అమరావతిలో ఏర్పాటు చేస్తున్న క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీ దేశానికి ఓ నూతన దిశను అందిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జాతీయ క్వాంటం మిషన్ లక్ష్యాలను తొలిగా అందిపుచ్చుకుని ఏర్పాటు చేసిన అమరావతి క్వాంటం వ్యాలీ దేశానికి ప్రగతి ప్రేరకంగా మారుతుందని అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన అమరావతి క్వాంటం వ్యాలీ క్వాంటం హార్డ్ వేర్ మాన్యుఫాక్చరింగ్ ఎకోసిస్టమ్ పై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి నేషనల్ క్వాంటం మిషన్ డైరెక్టర్ జేబీవీ రెడ్డి, స్టేట్ క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్, ఐబీఎం డైరెక్టర్ అమిత్ సింఘీ, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సీడాక్, సీడాట్, డీఆర్ డీఓ, నేవల్ సైన్స్ టెక్నాలాజికల్ లేబొరేటరీ, బార్క్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. క్యూబిట్ ఫోర్స్, క్యూబీట్స్, క్వాంటం ఏఐ గ్లోబల్, క్యూపిఐ ఏఐ, ఆటోమియోనిక్స్ , తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ సత్యనారాయణ హాజరయ్యారు. మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్ కామకోటి వర్చువల్ గా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి క్వాంటం కంప్యూటర్ పరికరాల తయారీ కంపెనీలు, క్రయోజనిక్స్, ఫోటోనిక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీల ప్రతినిధులు సైతం హాజరయ్యారు. వారిని ఉద్దేశించి సీఎం ప్రసంగిస్తూ.. రెండేళ్లలో దేశీయంగా క్వాంటం కంప్యూటింగ్ పరికరాల ఉత్పత్తి దిశగా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. త్వరలో సిద్ధం కానున్న ఏక్యూవీ నుంచి క్వాంటం కంప్యూటింగ్ పరికరాలు, ఇతర హార్డ్ వేర్ ఉత్పత్తి, అల్గారిథమ్స్ రూపకల్పన వంటివి చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. 2030 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 5 గ్లోబల్ క్వాంటం హబ్స్ లో ఒకటిగా ఏపీని తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపట్టాలని రౌండ్ టేబుల్ సమావేశంలో అభిప్రాయం వ్యక్తం అయ్యింది. అమరావతి క్వాంటం వ్యాలీలో దీనికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు హార్డ్ వేర్, ఎకోసిస్టం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బయోఫౌండ్రీ సహా వివిధ స్టార్టప్ ల సహకారంతో డిజైన్లు, ఆవిష్కరణలు, పరిశోధన చేపట్టాలని సమావేశంలో చర్చించారు. మేడ్ ఇన్ అమరావతి క్వాంటం కంప్యూటర్ పరికరాల ఉత్పత్తికి విస్తృత ప్రయత్నాలు చేయాలని సూచించారు. దేశంలో తొలి క్వాంటం కంప్యూటింగ్ పాలసీ కలిగిన రాష్ట్రంగా ఏపీ ఇప్పటికే క్వాంటం టెక్నాలజీ ప్రయాణాన్ని ప్రారంభించిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విజయవాడలోని మేధా టవర్స్ లో ఇప్పటికే తాత్కాలికంగా క్వాంటం కంప్యూటింగ్ మిషన్ కార్యాలయం కార్యకలాపాలు ప్రారంభం అయ్యాయని వివరించారు.

**ఏపీకే క్వాంటం తొలి ప్రయోజనాలు :** మూడు దశాబ్దాల క్రితం ఐటీని, ఇప్పుడు క్వాంటం కంప్యూటింగ్ టెక్నాలజీని ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్ గా అందిపుచ్చుకుంటున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

మిగతా 2లో...

# సందడిగా సాగుతున్న ఆలపాటి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు



- నాలుగు, ఆరుపళ్ళ విభాగంలో హోరాహోరీ పోటీలతో రైతాంగానికి ఉత్సాహం

**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** రైతు నేస్తమైన ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు తెనాలిలో ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 9వ జాతీయ స్థాయి ఈ పోటీలు డెల్టా ప్రాంత రైతాంగానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నవ వసంతాలుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమం రైతులకు వినోదంతో పాటు వ్యవసాయ విజ్ఞానాన్ని పంచుతూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది.

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వ్యవసాయ మార్కెట్ యార్డు వేదికగా ప్రారంభమైన ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఎడ్లజతలు పెద్ద ఎత్తున తరలివచ్చాయి. ఎడ్ల సామర్థ్యం, శక్తి, శిక్షణ ప్రతిభలను ప్రదర్శించే ఈ పోటీలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి.

**నాలుగు పళ్ళ విభాగంలో రసవత్తర పోటీలు :** రెండవ రోజు నిర్వహించిన నాలుగు పళ్ళ విభాగంలో పోటీలు హోరాహోరీగా సాగాయి.

**ప్రథమ బహుమతి (రూ. 40,000):** చాగంటి శ్రీనివాసరావు చౌదరి, అత్తోట శిరీష చౌదరి, శ్రీకృష్ణ చౌదరి – కొండెపాడు, ప్రత్తిపాడు మండలం, పల్నాడు జిల్లా – వారి ఉమ్మడి ఎడ్లజత 4,254.02 మీటర్లు బండలాగి ప్రథమ స్థానం సాధించింది. ఈ బహుమతిని అంగళకుదురు వాసి కావూరు కృష్ణమోహన్ స్పాన్సర్ చేశారు.

**ద్వితీయ బహుమతి (రూ. 30,000):** మద్దూరి నితీష్ కుమార్ రెడ్డి – సొలస, యడ్లపాడు మండలం, బాపట్ల జిల్లా –మరియు సురవరపు వెంకటరామిరెడ్డి – కొలకలూరు, తెనాలి మండలం, గుంటూరు జిల్లా –వారి ఉమ్మడి ఎడ్లజత 4,185.03 మీటర్లు బండలాగి ద్వితీయ స్థానం పొందింది. స్వర్గీయ కొత్తమాసు తులసీదాస్ పేరిట కుమారుడు కొత్తమాసు కుమార్ ఈ బహుమతి స్పాన్సర్ చేశారు.

**లితృతీయ బహుమతి (రూ. 25,000):** యలవర్తి శైలేంద్ర యాదవ్ – దాచేపల్లి, పల్నాడు జిల్లా – ఎడ్లజత 3,881.02 మీటర్లు బండలాగి తృతీయ స్థానం సాధించింది. స్వర్గీయ కొత్తపల్లి వెంకటకృష్ణయ్య పేరిట కుమారుడు రవీంద్రబాబు – అమృతలూరు – ఈ బహుమతి స్పాన్సర్ చేశారు.

**నాలుగవ బహుమతి (రూ. 20,000):** పివిఆర్ బుల్స్ – పాలెం వెంకటేశ్వర్లు, బ్రహ్మాట్ల పాలెం, చందర్లపాడు మండలం, ఎన్టీఆర్ జిల్లా. వల్లభాపురం వాసి కొల్లి నాగఫణీంద్రారెడ్డి స్పాన్సర్.

**ఐదవ బహుమతి (రూ. 15,000):** పొన్నెబోయిన విష్ణుభరత్ యాదవ్ – మాదల, ముప్పాళ్ళ మండలం, పల్నాడు జిల్లా. ఐతానగర్ వాసి గోగినేని కృష్ణచైతన్య స్పాన్సర్.



మిగతా 2లో...

# సందడిగా సాగుతున్న ఆలపాటి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు







(మొదటి పేజీ తరువాయి)
**ఆరవ బహుమతి (రూ. 12,000):** నక్కా బలరామకృష్ణయ్య – అబ్బూరు, సత్తెనపల్లి మండలం, పల్నాడు జిల్లా.
**ఏడవ బహుమతి (రూ. 10,000):** నల్లూరి నరసింహారావు – అప్పాపురం, నాదెండ్ల మండలం, పల్నాడు జిల్లా.
**ఎనిమిదవ బహుమతి (రూ. 8,000):** తలశిల రవితేజ, సాయితేజ – క్రాప కొల్లూరు మండలం, బాపట్ల జిల్లా.
**తొమ్మిదవ బహుమతి (రూ. 6,000):** షేక్ దాదబుడే – పసుమర్తి గ్రామం, చిలకలూరుపేట మండలం, పల్నాడు జిల్లా.

**ఆరుపళ్ళ విభాగంలో పోటీలు హోరాహోరీ :** మంగళవారం ఆరుపళ్ళ విభాగం పోటీలు మరింత ఉత్కంఠభరితంగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తొమ్మిది ఎడ్లజతలు పోటీలో పాల్గొని తమ ప్రతిభను చాటుతున్నాయి. రైతులు, ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో హాజరై పోటీలను ఆసక్తిగా వీక్షిస్తున్నారు.

**ప్రముఖుల సందర్శన, సత్కారాలు :** రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్య అతిథిగా హాజరై పోటీలను వీక్షించారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, రాష్ట్రరైతు మిషన్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.
ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నందమూరి తారకరామా రావు విగ్రహానికి గజమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం ఆలపాటి శివరామకృష్ణయ్య విగ్రహం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కమిటీ సభ్యులు అతిథులను ఘనంగా సత్కరించారు.

**పోటీలపై ప్రశంసలు - ఒంగోలు జాతి ప్రాధాన్యత :** ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ పోటీల నిర్వహణ తీరును ప్రశంసించారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఒంగోలు జాతి వృషభాలు ప్రపంచ ఖ్యాతి గాంచినవని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ కార్యక్రమాలు రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతున్నాయని తెలిపారు. ప్రజల రాజధాని అమరావతికి త్వరలో పార్లమెంట్‌లో గుర్తింపు లభిస్తుందని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు చూపుకు నిదర్శనమన్నారు.
గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు పక్షపాత విధానాలను అమలు చేస్తోందని, రైతుల జీవితాల్లో మార్పులు తీసుకువస్తోందన్నారు. రైతులకు ఇష్టమైన ఎడ్ల బలప్రదర్శన పోటీలను ప్రోత్సహిస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆలోచనలు రైతు ప్రయోజనకరమని కొనియాడారు.

**రైతాంగానికి ప్రోత్సాహం - సంస్కృతి పరిరక్షణ :** ఎడ్ల బలప్రదర్శన పోటీలు గ్రామీణ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల ద్వారా ఒంగోలు జాతి ఎడ్ల పరిరక్షణకు తోడ్పడటమే కాకుండా, రైతులకు ప్రోత్సాహం లభిస్తోందని పేర్కొన్నారు. పోటీల నిర్వహణలో మార్కెట్ యార్డు కమిటీ, పోటీల కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారు.

# చేనేతలకు 'పవర్' గిఫ్ట్...

(మొదటి పేజీ తరువాయి)
ఉన్న చేనేత రంగాన్ని గట్టెక్కించేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అనేక సంస్కరణలు చేపట్టింది. అందులో భాగంగానే నేతన్నలకు ఇచ్చే పెన్షన్‌ను రూ. 4 వేలకు పెంచింది. రూ. 5 కోట్ల మేర త్రిఫ్ట్ ఫండ్ నిధులు చేనేత సహకార సంఘాలకు కేటాయించింది. ఆధునిక యంత్రాల కొనుగోలుపై 90 శాతం వరకు రాయితీ కల్పిస్తోంది. ముడి సరుకులపై 15 రాయితీ ఇవ్వడంతో పాటు, నాణ్యమైన నూలు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటోంది. చిన్న క్లస్టర్ల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ. 10.44 కోట్లు నిధులు మంజూరు చేసింది. వీటితో పాటు మార్కెటింగ్ సదుపాయం కోసం అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థల ద్వారా నేరుగా వినియోగదారులు అమ్మకాలు జరిపేలా అవకాశం కల్పిస్తోంది. తాజాగా ఇప్పుడు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది.

# బీహార్‌లో పెను విషాదం

(మొదటి పేజీ తరువాయి)
ఈ క్రమంలో ఒక్కసారిగా తోపులాట జరగడంతో భక్తులు ఊపిరి ఆడక కిందపడిపోయారు. ఈ తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారంతా మహిళలేనని అధికారులు ధ్రువీకరించారు. మరో 12 మంది ఈ ఘటనలో తీవ్రంగా గాయపడగా, వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు.
అలాగే క్షతగాత్రులలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని సమాచారం. ఈ దారుణ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు అండగా ఉండేందుకు పీఎంఆర్ఎఫ్ నుండి మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ. 50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. స్థానిక యంత్రాంగం సహాయక చర్యలను పర్యవేక్షిస్తోందని, భక్తుల రద్దీని నియంత్రించేందుకు అదనపు బలగాలను మోహరించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

# రోడ్డు భద్రతకు 'హైటెక్' నిఘా..



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రోడ్డు భద్రతను బలోపేతం చేయడానికి ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.
బస్సుల్లో ఏర్పాటు చేసిన డ్యాష్‌క్యామ్‌ల ద్వారా డ్రైవర్ ప్రవర్తనతో పాటు వాహనం ముందు దృశ్యాలు నిరంతరం రికార్డ్ అవుతున్నాయని పేర్కొన్నారు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ వినియోగం, ధూమపానం వంటి అనుచిత చర్యలు గుర్తించిన వెంటనే అలర్ట్‌లు వస్తాయని, వాటి ఆధారంగా కంట్రోల్ రూమ్ నుంచి డ్రైవర్లను తక్షణమే హెచ్చరిస్తున్నామని తెలిపారు. వాహనాల వేగాన్ని కూడా ఈ వ్యవస్థ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.
సేకరించిన డేటాను 8 రోజుల పాటు భద్రపరుస్తున్నట్లు తెలిపారు. ఇటీవల బస్సు యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఈ వ్యవస్థ అమలుకు వారు పూర్తి సహకారం అందించేందుకు అంగీకరించినట్లు పేర్కొన్నారు.
ప్రస్తుతం ఐఆర్ఏ ట్రావెల్స్‌కు చెందిన 24 బస్సుల్లో ఈ సిస్టమ్ అమలులో ఉందని, వచ్చే 15 నుంచి 30 రోజుల్లో అన్ని బస్సులకు విస్తరించే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరింత అధునాతన సదుపాయాలతో పెద్ద కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.
మొత్తం 1500 బస్సుల్లో ఈ వ్యవస్థ అమలు పూర్తైన తర్వాత అధికారిక ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఒక్కో బస్సుకు సుమారు రూ. 12,000 ఖర్చు అవుతుందని, నెలవారీ నిర్వహణ ఖర్చు రూ. 750 వం-కు ఉంటుందని తెలిపారు. ఈ వ్యయాన్ని బస్సు యజమానులే భరించడానికి ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు.
రోడ్డు ప్రమాదాల నివారణలో ఈ చర్య కీలకంగా నిలుస్తుందని, డ్రైవర్ల భద్రతతో పాటు ప్రయాణికుల ప్రాణాలను కాపాడటంలో ఈ సాంకేతిక వ్యవస్థ ముఖ్య పాత్ర పోషిస్తుందని మంత్రి వెల్లడించారు.


# తుళ్లూరులో క్యాన్సర్ ఆస్పత్రి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పేదలకు మెరుగైన క్యాన్సర్ చికిత్సను అందించాలన్నదే బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి ప్రధాన లక్ష్యమని ఆస్పత్రి ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. క్యాన్సర్ చికిత్స అందరికీ అందుబాటులో ఉంచాలనేదే తమ లక్ష్యమని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి ఛైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు.
తుళ్లూరులో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణ పనుల్ని వారం రోజుల్లో మొదలు పెడతామని ట్రస్టు ఛైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తెలిపారు.
హైదరాబాద్‌లోని బసవతారకం ఆసుపత్రిలో అంబులెన్స్, ఏఐ ఆధారిత అల్ట్రాసౌండ్ స్కానింగ్ సహా పలు పరికరాలను బాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడారు. బీడీఎల్ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాన్ని ఆస్పత్రికి విరాళంగా ఇచ్చారు. ఏఐ సాంకేతికత కలిగిన యంత్రం ఇది. తక్కువ సమయంలోనే స్కానింగ్ చేసి కచ్చితత్వంతో కూడిన ఫలితాలను అందిస్తుంది. దాతల సహకారంతో ఆస్పత్రిలో పేదలకు మెరుగైన సేవలు అందించగలుతున్నాం. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు, పారిశ్రామికవేత్తలు, దాతల సహకారంతో ఆస్పత్రి ఈ స్థాయికి చేరింది. త్వరలో దీన్ని విస్తరిస్తాం. ఏపీ రాజధాని పరిధిలోని తుళ్లూరులో మరో వారం రోజుల్లో ఆస్పత్రి నిర్మాణం ప్రారంభిస్తాం.' ఈ కార్యక్రమంలో ఆస్పత్రి బోర్డ్ మెంబర్ నారా బ్రాహ్మణి, మెడికల్ డైరెక్టర్? సుబ్రహ్మణ్యేశ్వర రావు, బీడీఎల్ ప్రతినిధులు, వైద్యులు పాల్గొన్నారు. దిల్లీలో జరిగిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో బాలయ్యకు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు వరించిన సందర్భంగా ఆస్పత్రి సిబ్బంది, బోర్డు సభ్యులు ఆయనను సత్కరించారు. అనంతరం గ్లోబల్ ఫోరం ఆఫ్ క్యాన్సర్ సర్జన్స్‌కి ప్రెసిడెంట్‌గా ఎన్నికైన బసవతారకం ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యేశ్వర్‌రావుని బాలకృష్ణ సత్కరించారు.
ఈ సందర్భంగా మాట్లాడిన నందమూరి బాలకృష్ణ త్వరలోనే ఏపీలోని తుళ్లూరులో ఆస్పత్రి నిర్మాణం ప్రారంభించనున్నట్టు ప్రకటించారు. రాజధాని అమరావతిలోని తుళ్లూరు సమీపంలో బసవతారకం క్యాన్సర్ ఆస్ప్రతి నిర్మాణానికి శంకుస్థాపన గతంలోనే జరిగిన సంగతి తెలిసిందే.

# మేడ్ ఇన్ అమరావతి క్వాంటం హార్డ్ వేర్ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)
గతంలో ఐటీలో నిపుణుల్ని తయారుచేయడానికి ఇంజనీరింగ్ కాలేజీలు, ట్రిపుల్ ఐటీలను కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేసుకున్నామని... ఇప్పుడు క్వాంటం టెక్నాలజీని అందిపుచ్చుకునేలా నిపుణులకు శిక్షణ ఇస్తున్నామని వివరించారు. వైసర్, ఐబీఎం లాంటి సంస్థల సహకారంతో యువతకు క్వాంటంలో నైపుణ్యాలు పెంచుతున్నామన్నారు. అవేర్ ద్వారా రియల్ టైమ్ డేటా సేకరించటంతో పాటు రియల్ టైమ్ లో నిర్ణయాలు జరిగేలా చర్యలు చేపట్టామన్నారు. ఏఐ డాక్టర్, ఏఐ ట్యూటర్, ఏఐ అగ్రానమిస్ట్ లాంటి సేవలు పౌరులకు అందాల్సి ఉందన్నారు. ఆధునిక టెక్నాలజీలను తొలిగా అందిపుచ్చుకున్న వారికే ఎప్పుడూ ప్రయోజనాలు దక్కుతాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఐటీ ద్వారా హైదరాబాద్ నాలెడ్జి ఎకానమీగా మారిందని తద్వారా సేవల రంగం పెరిగి దేశానికి ప్రయోజనం కలుగుతోందన్నారు. భవిష్యత్తు అంతా ఇక క్వాంటం కంప్యూటింగ్‌దేనని జాతీయ క్వాంటం మిషన్ లక్ష్యానికి అనుగుణంగా ఏక్యూవీని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్అండ్ టీ సహకారంతో దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ ఏపీలో ఏర్పాటు అవుతోందని సీఎం వివరించారు.
రాజధాని అమరావతిలో క్వాంటం వ్యాలీలో నిర్మిస్తున్న 8 టవర్లలో క్వాంటం కంప్యూటింగ్



సెంటర్‌తో పాటు ఆవిష్కరణలు, పరిశోధనలతో పాటు స్టార్టప్‌లకు కూడా అవకాశం కల్పిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. క్వాంటం హార్డ్ వేర్ దిగుమతి కాకుండా ఇక్కడే తయారు చేసుకోవాలన్న లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలియచేశారు. క్వాంటం పరికరాలు, టెక్నాలజీ, క్రయోజనిక్స్, అల్గారిథమ్స్ ఇలా మనమే తయారు చేసుకునేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీతో అమరావతి ఇక భవిష్యత్ నగరంగా అత్యుత్తమ లివబుల్ సిటీగా మారుతుందన్నారు. దీనికి అవసరమైన టెక్నాలజీని, భాగస్వామ్యాన్ని అందించాలని జాతీయ క్వాంటం మిషన్ ను ముఖ్యమంత్రి కోరారు.

**ఏప్రిల్ 14న అందుబాటులోకి తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్ :** దేశంలోనే తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్ అమరావతిలో ఏప్రిల్ 14 తేదీ నుంచి అందరికీ అందుబాటులోకి తీసుకురానున్నట్టు క్యూబిట్ ఫోర్స్ సంస్థ డైరెక్టర్ వెంకట్ సుబ్రమణ్యన్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సతీష్ కుమార్ ముఖ్యమంత్రికి వివరించారు. విద్యార్ధులు, పరిశోధకులకు ఈ క్వాంటం కంప్యూటర్ టెస్టింగ్ కోసం సిద్ధంగా ఉంటుందని తెలిపారు. క్వాంటం ఎకోసిస్టమ్ కు అనువుగా టెస్ట్ బెడ్స్, సర్టిఫికేషన్ లాంటివి ఉండాలని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీడాక్ ఈడీ సుదర్శన్ వివరించారు. క్వాంటం సిమ్యులేటర్స్ తో పాటు బయోసెన్సార్స్, మినరల్ సెన్సార్స్, లేజర్ అప్లికేషన్స్ అమరావతి క్వాంటం వ్యాలీలో అందించేందుకు సిద్ధమని వివిధ క్వాంటం కంప్యూటింగ్ సంస్థలు ముఖ్యమంత్రికి తెలియచేశాయి. జాతీయ క్వాంటం మిషన్ లక్ష్యాలను అందిపుచ్చుకోవటంలో ఏపీ అగ్రస్థానంలో ఉందని ఎన్ క్యూఎం మిషన్ డైరెక్టర్ జేబీవీ రెడ్డి ముఖ్యమంత్రికి తెలిపారు. మొత్తంగా 30కి పైగా క్వాంటం కంప్యూటింగ్ పరికరాల తయారీ కంపెనీలు ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యాయి. 15 కంపెనీలతో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకుంది. విజయవాడలోని మేధా టవర్స్ లో 7 సంస్థలు ఇప్పటికే తమ కార్యకలాపాలను ప్రారంభించాయి.


# బీజేపీ 'వికసిత కేరళం' మేనిఫెస్టో విడుదల..




**నేషనల్ డెస్క్(జర్నలిస్ట్ ఫైల్) :** కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీజేపీ ప్రచారంలో వేగం పెంచింది. ఇందులో భాగంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ మంగళవారం ఎన్డీయే ఎన్నికల మేనిఫెస్టో 'వికసిత కేరళం విజన్ 2026'ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మేనిఫెస్టోలో పేద, మధ్యతరగతి వర్గాలను ఆకట్టుకునేలా భారీ హామీలు ప్రకటించారు. ముఖ్యంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంవత్సరానికి రెండు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందిస్తామని, వీటిని రాష్ట్రంలో ప్రధాన పండుగలైన ఓనం, క్రిస్మస్ సమయాల్లో పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.
ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం వారి వార్షిక ఆదాయ పరిమితిని ప్రస్తుతం ఉన్న దాని నుంచి రూ. 8 లక్షలకు పెంచుతామని నితిన్ నబీన్ స్పష్టం చేశారు. పేద మహిళల కోసం 'భక్ష్య ఆరోగ్య సురక్ష' కార్డు ద్వారా నెలకు రూ. 2,500 రీఛార్జ్, అర్హులైన మహిళలు, 70 ఏళ్లు పైబడిన వారికి నెలకు రూ. 3,000 పెన్షన్ వంటి ఇతర సంక్షేమ పథకాలను కూడా మేనిఫెస్టోలో పొందుపరిచారు. రాష్ట్రంలో ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టిన ఆయన, తమకు అవకాశం ఇస్తే కేరళను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి 'వికసిత కేరళంగా మారుస్తామని ప్రజలకు భరోసా ఇచ్చారు.

# ప్రతీ నెల 4వ శనివారం 'స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్మెంట్'

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మెరుగైన ప్రజారోగ్యం కోసం అందరూ ఉద్యమంలా కృషి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఏప్రిల్ నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, వైద్యాధికారులు ప్రజల్లోకి వెళ్లాలని సీఎం సూచించారు. ప్రతీ నెల 4వ శనివారం 'స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్మెంట్' గ్రామసభలు, హెల్త్ క్యాంపులు, అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సంజీవని ప్రాజెక్టుపై క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే చిత్తూరు జిల్లా, కుప్పం, నారావారిపల్లెలో సమర్ధవంతంగా అమలవుతోన్న ప్రాజెక్టును జూలై కల్లా రాష్ట్రమంతటా అమలయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలో 56.40 లక్షల మందికి వైద్య పరీక్షలు జరపాలనే లక్ష్యాన్ని అధికారులకు సీఎం నిర్దేశించారు. వైద్య పరీక్షల ఫలితాలను వాట్సప్ ద్వారా నేరుగా 48 గంటల్లో వారికి



అందించాలన్నారు. అయితే ఇందుకోసం 904 మొబైల్ మెడికల్ యూనిట్ అవసరం కానున్నాయని, రూ. 162 కోట్లు వ్యయం అవుతుందని అధికారులు వివరించగా... ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 3.14 లక్షల మంది సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ డేటాబేస్‌లో నమోదు చేసుకున్నారని అధికారులు వివరించారు. మరోవైపు వ్యక్తిగత హెల్త్ రికార్డ్ ఎప్పటికప్పుడు అప్డేట్ అయ్యేలా చూడాలని సీఎం ఈ సందర్భంగా అన్నారు. భవిష్యత్‌లో వైద్య ఖర్చులు తగ్గేలా సేవలు అందించగలగాలని, ప్రివెంటివ్ హెల్త్‌పై దృష్టి పెట్టాలన్నారు. యోగా, న్యూట్రిషన్, మెడిటేషన్, ప్రాణాయామం వంటివి తప్పనిసరిగా అనుసరించడం వల్ల చాలా వరకు ఆరోగ్య సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సీఎం చెప్పారు. సంజీవని ప్రాజెక్టు అమలవుతున్న చిత్తూరు జిల్లాలో ప్రజారోగ్యం ఏమేరకు మెరుగయ్యిందో పరిశీలించాలని సూచించారు.

**త్వరలో 'యూనివర్సల్ హెల్త్ పాలసీ' :** మాతృత్వ, శక్తి, నైపుణ్యం, క్షేమ, సంజీవని... ఈ 5 పిల్లర్లతో త్వరలో 'ఏపీ హెల్త్ మేనేజ్మెంట్ పాలసీ' తీసుకురావాలని అధికారులకు సీఎం నిర్దేశించారు. త్వరలో ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా రాష్ట్రంలో యూనివర్సల్ హెల్త్ పాలసీ అమలుపైనా సీఎం సమీక్షించారు. యూనివర్సల్ హెల్త్ పాలసీలో భాగస్వామి అయ్యేందుకు పలు బీమా సంస్థలు ముందుకు వస్తున్నట్టు అధికారులు తెలిపారు. పీపీపీ విధానంలో చేపట్టదలచిన మెడికల్ కాలేజీల నిర్మాణంపై సీఎం చర్చించారు. వైద్యారోగ్య శాఖలో ఎక్కడా ఖాళీలు ఉండకూడదని, రేషనలైజేషన్ ద్వారా ఖాళీలు ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని స్పష్టం చేశారు. ఫార్మసీ నెట్వర్క్, ల్యాబొరేటరీ ఇంటిగ్రేషన్ జరగాలన్నారు. అనారోగ్య సమస్యలు, అత్యవసరవ వైద్య పరిస్థితులు, వైద్య బృందం సూచనల మేరకు మాత్రమే గర్భిణులకు ఇకపై సిజేరియన్లు చేయాలని, మిగిలిన సమయంలో నార్మల్ డెలివరీలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 20 శాతానికి మించి సిజేరియన్లు జరిగితే ఆడిటింగ్ చేయాలన్నారు. సమీక్షలో వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, సంయుక్త కార్యదర్శి రోణంకి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

# ప్రతి నియోజకవర్గంలో 'మోడల్ సోలార్ విలేజ్'

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. సీపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ తో పాటు నెడ్ క్యాప్ అధికారులతో మంత్రి గొట్టిపాటి సచివాలయంలో మంగళవారం నాడు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ., ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలోని ప్రజలందరికీ నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన అన్ని చర్యలూ చేపట్టాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్డీఎస్ఎస్, పీఎం సూర్యఘర్, అగ్రికల్చర్ కనెక్షన్లు, లో ఓల్టేజ్ సమస్యలపై అధికారులతో సమీక్షించారు. పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను సీజన్ మొదలయ్యేనాటికి మంజూరు చేయాలన్నారు. వీటితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో లో ఓల్టేజ్ సమస్య పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ భారాలను, నష్టాలను తగ్గించుకోవడానికి సోలార్ వంటి పునరుత్పాదక ఇంధనాల వినియోగం పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గానికో మోడల్ సోలార్ విలేజ్ ను అభివృద్ధి చేయాలని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. అదే విధంగా వినియోగదారుల సంతృప్త స్థాయిని 90 శాతానికి పెంచాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

**ముందుగా ఏపీసీపీడీసీఎల్, నెడ్ క్యాప్ అధికారులతో.... :** సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో ముందుగా సీపీడీసీఎల్, నెడ్ క్యాప్ అధికారులతో మంత్రి గొట్టిపాటి సమీక్ష నిర్వహించారు. వివిధ అంశాలపై చర్చించిన ఆయన, సౌర విద్యుత్ వినియోగాన్ని విస్తృతం చేసే దిశగా., వినియోగదారుల అనుమతితో పీఎం సూర్యఘర్ కనెక్షన్లు మంజూరు చేయాలన్నారు. దీనికి సంబంధించి ప్రతి జిల్లాలోనూ అధికారుల సమన్వయంతో పనులు వేగవంతం చేయాలని సూచించారు. మెటీరియల్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత సోలార్ కనెక్షన్లతో పాటు వేసవి



ముగిసే నాటికి ప్రతి నియోజకవర్గంలో కనీసం 6 వేల సూర్యఘర్ కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోవాలని పేర్కొన్నారు. అదే విధంగా, వచ్చే నాలుగు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 6 లక్షల పీఎం సూర్యఘర్ కనెక్షన్లను పూర్తి చేయాలని మంత్రి పేర్కొన్నారు. సోలార్ ప్యానెల్స్ వినియోగం, పీఎల్ఎఫ్ పెంచేందుకు ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి సూచించారు. ఆర్డీఎస్ఎస్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు తెలిపిన మంత్రి గొట్టిపాటి.. పీఎం కుసుమ్ పనులను వేగవంతం చేయాలని, భూ కేటాయింపుల విషయంలో జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. సీపీడీసీఎల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 11 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను తక్షణం మంజూరు చేయాలని తెలిపారు. గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని మంత్రి గొట్టిపాటి అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాల్లో కొనుగోలుదారులపైనా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసుల సహకారంతో కేసులు నమోదు చేయించాలని సూచించారు. లో ఓల్టేజ్ సమస్యల పరిష్కారానికి ఇప్పటికే 980 ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు.

**ఎస్పీడీసీఎల్ పరిధిలో..... :** సచివాలయంలో మంగళవారం నాడు మంత్రి గొట్టిపాటి ఎస్పీడీసీఎల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మంత్రి గొట్టిపాటి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనలతో మూడు నెలల్లో ఆర్డీఎస్ఎస్ పనులను పూర్తి చేయాలన్నారు. పీఎల్ఎఫ్ ను పెంచే దిశగా వినియోగదారులకు అవగాహన కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో పీఎం సూర్యఘర్, ఆర్డీఎస్ఎస్, అగ్రికల్చర్ కనెక్షన్లు, లో ఓల్టేజ్ సమస్యలపై ఆరా తీసిన మంత్రి వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.
రాష్ట్రానికి ఎంతో ఉపయుక్తమైన పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలను గత ప్రభుత్వం ఉపయోగించుకోలేదని మంత్రి గొట్టిపాటి విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో చేపడుతున్న సూర్యఘర్ పనుల్లో అత్యధిక నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. పీఎం సూర్యఘర్, కుమమ్ పథకాల ద్వారానే ట్రాన్స్ మిషన్ నష్టాలను తగ్గించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో ఆటంకాలు తొలగించి ఆలస్యం లేకుండా చూడాలని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో లో ఓల్టేజ్ సమస్యలు లేకుండా చూడటం ద్వారా వినియోగదారుల సంతృప్త స్థాయి పెంచవచ్చని తెలిపారు. అదే విధంగా వినియదారుల సమ్మతి మేరకు మాత్రమే స్మార్ట్ మీటర్లను బిగించాలని మంత్రి గొట్టిపాటి అధికారులకు సూచించారు. సమీక్షల్లో సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి, ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్, డైరక్టర్లు, నెడ్ క్యాప్ అధికారులతో పాటు ఇంధన శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి.



- మంగళగిరి ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో బాధితులను పరామర్శించిన మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్ లు

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** కృష్ణాజిల్లా చల్లపల్లి పోలీస్ స్టేషన్ వద్ద టపాసుల పేలుడు ఘటనలో క్షతగాత్రులైన కోర్టు కానిస్టేబుల్ అబ్దుల్లా డ్రైవర్ నాగరాజు ఎస్సై డి దుర్గా ఆంజనేయులును మెరుగైన చికిత్స నిమిత్తం మంగళగిరి ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తీసుకువచ్చారు. మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, ఏలూరు ఐ జి అశోక్ కుమార్ కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ గుంటూరు డి ఎం హెచ్ ఓ విజయలక్ష్మి మంగళవారం మధ్యాహ్నం ఎన్నారై ఆస్పత్రికి చేరుకున్నారు. బాధితులను పరామర్శించారు. ఘటన దురదృష్టకరమని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రులు ఆదేశించారు. విధి నిర్వహణలో ప్రమాదానికి గురైన వారిని ఆదుకుంటామని, అండగా ఉంటామని తెలిపారు. ఎన్ఆర్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ తో మాట్లాడారు.

## ఏపీ పంచాయతీలకు 5 జాతీయ అవార్డులు



- ఏపీ సర్పంచ్ ల సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలకలపూడి పాపారావు హర్షం

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ ప్రకటించిన జాతీయ స్థాయి పురస్కారాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఐదు పంచాయతీలు ఎంపిక కావడం పట్ల రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సంక్షేమం అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, ఏపీ సర్పంచ్ ల సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలకలపూడి పాపారావు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం తాడేపల్లి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా శృంగవరం (విశాఖపట్నం) మరియు బొక్కసంపాళెం (తిరుపతి) గ్రామ పంచాయతీలు దేశంలోనే నంబర్ వన్ (1వ ర్యాంకు) స్థానంలో నిలవడం గర్వకారణమని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఈ అవార్డులు రాష్ట్రంలోని స్థానిక సంస్థల పటిష్టతకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధికి నిదర్శనం అన్నారు . పేదరిక నిర్మూలన, సుపరిపాలన, మహిళా సంక్షేమం వంటి అంశాల్లో మన పంచాయతీలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి అని పేర్కొన్నారు.

తిరుపతి జిల్లా బొక్కసంపాళెం పంచాయతీ 'మహిళా స్నేహపూర్వక' విభాగంలో మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు.

విశాఖ జిల్లా శృంగవరం పంచాయతీ ఉత్తమ పాలనలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవడం విశేషమని చెప్పారు.

కుప్పం బ్లాక్ పంచాయతీతో పాటు కడప, ప్రకాశం జిల్లాల పంచాయతీలు సాధించిన ర్యాంకులు స్థానిక ప్రజాప్రతినిధుల కష్టానికి ప్రతిఫలమని ఆయన కొనియాడారు.

ఈ విజయం సాధించిన ఆయా పంచాయతీల సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు, అధికారులకు, గ్రామ ప్రజలకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని పంచాయతీలు ఈ స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

## పొన్నూరులో గంజాయి కేసు
## 8 మంది అరెస్ట్, ఒకరు పరార్



**పొన్నూరు (జర్నలిస్ట్ ఫైల్):** పొన్నూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయం, వినియోగంపై కేసు నమోదు చేసి 8 మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఒక నిందితుడు పరారీలో ఉన్నాడు.

జిల్లాలో గంజాయి వంటి నిషేధిత మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు జిల్లా పోలీస్ అధికారి వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం పొన్నూరు రూరల్ సీఐ పి. కృష్ణయ్యకు అందిన సమాచారం మేరకు పచ్చల తాడిపర్రు గ్రామ శివారులో జూపూడి గ్రామానికి సమీపంలోని పొలాల వద్ద పోలీసులు దాడి నిర్వహించారు.

పోలీసులను గమనించిన నిందితులు పారిపోవడానికి ప్రయత్నించగా, సిబ్బంది 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఒకరు పరారయ్యాడు. నిందితులను విచారించగా, చుక్కా సుబ్బారావు, మొవ్వ సాయి కుమార్, షేక్ మహబూబ్ సుభాని తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి పొన్నూరు పట్టణం, పరిసర ప్రాంతాల్లో చిన్న ప్యాకెట్లుగా విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. నిందితుల వద్ద నుంచి సుమారు 1.250 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. మొత్తం 12 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మిగిలిన నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది.

గంజాయి విక్రయం, వినియోగంపై కఠిన చర్యలు కొనసాగుతాయని, తరచూ ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై పీడీ చట్టం కింద చర్యలు తీసుకునే అవకాశముందని సీఐ కృష్ణయ్య తెలిపారు.

## స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్‌కు
## రూ.50.59 లక్షల విరాళం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఒప్పో ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ తస్లీమ్ ఆరిఫ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ కోసం రూ. 50.59 లక్షల చెక్కును అందజేశారు.

ఈ విరాళాన్ని పేదరిక నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన పీ4 కార్యక్రమానికి అందిస్తున్నట్లు తస్లీమ్ ఆరిఫ్ తెలిపారు. ఈ కార్యక్రమం సమాజంలో సానుకూల మార్పులకు దోహదం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

విరాళాన్ని స్వీకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తస్లీమ్ ఆరిఫ్‌ను అభినందించారు. పేదరిక నిర్మూలన దిశగా ప్రభుత్వం చేపట్టిన పీ4 కార్యక్రమం స్ఫూర్తిదాయకమని తస్లీమ్ ఆరిఫ్ కొనియాడారు.

# అధికారుల పనితీరును ఇకపై నేరుగా ప్రజలకే చెబుతా

- పరిపాలనలో పారదర్శకతకు పెద్ద పీట వేస్తాం
- ఉద్యోగుల పనితీరును మెరుగుపరిచేందుకు శిక్షణ కేంద్రాలు
- ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సమీక్షించిన ముఖ్యమంత్రి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పరిపాలనలో ఎలాంటి లోపాలు.. అధికారుల పనితీరులో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఇకపై ఉన్నతస్థాయి ఉద్యోగులు మొదలుకుని... క్షేత్ర స్థాయిలో పని చేసే ఉద్యోగులందరి పనితీరును ఎప్పటికప్పుడు బేరీజు వేస్తామని చెప్పారు. పనితీరు బాగున్న అధికారులను మరింత ప్రోత్సహిస్తామని... పనితీరు సరిగా లేని వారిని గాడిలో పెడతామని.. అప్పటికీ మారకుంటే నిబంధనల ప్రకారం వ్యవహరిస్తామని చెప్పారు. ఇకపై జిల్లాల పర్యటనకు వెళ్లే సందర్భంలో వివిధ శాఖల పనితీరును నేరుగా పరిశీలిస్తానని వెల్లడించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ప్రభుత్వం చాలా మంచి కార్యక్రమాలు చేపడుతోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోంది. వీటిని సమర్థవంతంగా అమలు చేయడాన్ని ప్రాధాన్యతగా తీసుకుంటూనే... వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లడాన్ని కూడా అంతే ప్రాధాన్యతగా తీసుకోవాలి. జిల్లాల్లోని పరిపాలనా యంత్రాంగం కూడా సోషల్ మీడియాలో చురుగ్గా ఉండాలి. తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టడమే కాకుండా... ప్రభుత్వం చేసే మంచి కార్యక్రమాలను, అభివృద్ధిని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలి. ఈ మేరకు సోషల్ మీడియా ఇన్ ఫ్లూయన్సర్ల సేవలు వినియోగించుకోవాలి. ఇకపై నేను జిల్లాల పర్యటనలకు వెళ్లిన సందర్భాల్లో పరిస్థితిని బట్టి ఆకస్మిక తనిఖీలు చేస్తాను. శాఖల పనితీరును.. అధికారులు, ఉద్యోగుల పనితీరును కూడా క్షేత్ర స్థాయిలోనే విశ్లేషిస్తా. ప్రజలకు వాస్తవాలను స్వయంగా నేనే వివరిస్తాను. ప్రభుత్వం పారదర్శకంగా పని చేస్తుందనే విషయం ప్రజలకు అర్థం కావాలి. అధికారులు, ఉద్యోగులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహించుకునేలా చూస్తాం. ప్రభుత్వ సేవలు అందించే విషయంలో ఏమైనా సాంకేతిక, పరిపాలనా పరమైన ఇబ్బందులుంటే వాటిని తొలగించాలి. ఉద్యోగుల పనితీరును మెరుగుపరిచేలా.. వారికి అవసరమైన శిక్షణ ఇస్తాం. ఈ మేరకు అమరావతిలో రాష్ట్రస్థాయి శిక్షణ కేంద్రాన్ని, వివిధ ప్రాంతాల్లో జోనల్ వారీగా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలి."అని ముఖ్యమంత్రి సూచించారు.

**కుల ధృవీకరణ పత్రాల జారీలో లోటుపాట్లను సరిదిద్దాలి :** "ప్రభుత్వం అందించే ప్రతి సేవలో ప్రజా కోణం అనేది మరిచిపోకూడదు. మనం అందించే సేవలు ప్రజలకు చేరువ కావడంతోపాటు... వారిని సంతృప్తి పరిచేలా చూడాలి. ప్రభుత్వం మన కోసం ఉంది.. మనకు అండగా నిలిచేందుకు ఉంది అనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించేలా ఉద్యోగులు విధులు నిర్వర్తించాలి. ఎలాంటి ఫలితం ఆశించకుండా... ప్రజలకు అద్భుతంగా సేవలందించే ఉద్యోగులు ఉంటారు. సంజీవని సహా వివిధ ప్రభుత్వ సేవలను టెక్నాలజీ ద్వారా ఏ విధంగా అందుకోవచ్చనే అంశంపై ప్రజలకు అగాహన కల్పించాలి. అలాంటి వారికి గుర్తింపు దక్కేలా చూస్తాం. కుల ధృవీకరణ పత్రాల విషయంలో కొన్ని పొరపాట్లు చోటు చేసుకుంటున్నాయి. పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పొరపాట్ల కారణంగా కుల ధృవీకరణ పత్రాల విషయంలో తేడాలు జరిగాయి. అలాంటి వాటిని సరి చేయాలి. కుల ధృవీకరణ పత్రాలు దుర్వినియోగం కాకుండా అధికారులు శ్రద్ధ తీసుకోవాలి. శాంతి భద్రతల విషయంలో... మిస్సింగ్ పర్సన్స్ ట్రేస్ చేసే అంశంలో, సంఘ విద్రోహ శక్తులను గుర్తించే విషయంలో టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి. సీసీటీవీ నెట్ వర్క్ ను మరింత బలోపేతం చేసుకోవాలి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువతలో ఉన్న టాలెంట్ వెలికి తీయాలి. స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించాలి. ఎన్విడియా వంటి ప్రముఖ సంస్థలతో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఎంఓయూ కుదుర్చుకుని కలిసి పని చేయాలి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కేంద్రాలను త్వరలో సందర్శిస్తాను. యూనివర్శిటీల్లో కూడా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అందిస్తున్న సేవలను ప్రమోట్ చేయాలి. కుప్పంలో ఆగస్త్య వంటి సంస్థలు పిల్లల్లో నైపుణ్యాలను వెలికి తీస్తున్నాయి. అలాంటి సంస్థలతో అధికారులు సంప్రదింపులు జరపాలి. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- హామీల అమలుపై ఉద్యోగులను నిరాశ పరుస్తున్న ప్రభుత్వ వైఖరి




**ఉయ్యూరు (జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యోగులకు మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు ప్రభుత్వాన్ని కోరారు. ఉయ్యూరులోని నాగళ్ల రాజేశ్వరమ్మ,జానకిరామయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సమావేశంలో సురేష్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు ఉద్యోగులకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు కొరకు ప్రభుత్వం చొరవ చూపకపోవడం ఉద్యోగులను నిరాశకు గురి చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగులకు మొదటి తేదీనే జీతాలు చెల్లించడం తప్ప ఇతర చాలా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పిఆర్సీ కమిటీ నియామకం, మధ్యంతర భృతి చెల్లింపు, సిపిఎస్ విధానం రద్దు తదితర అంశాలపై నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం మేనిఫెస్టోలో స్పష్టంగా పేర్కొందని సురేష్ బాబు గుర్తు చేశారు. శాశ్వత ఉద్యోగులతోపాటు సమానంగా సేవలందిస్తున్న కాంట్రాక్టు మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు ఎక్కడి గొంగళి అక్కడే అన్న చందాన ఉన్నాయని వాపోయారు. పెండింగ్ లో ఉన్న డీఏలలో కేవలం ఒక డిఏ మాత్రమే చెల్లించడం వల్ల నానాటికి డిఏ బకాయిలు పెరిగిపోతున్నాయన్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు అమలు కొరకు సంఘాలతో చర్చించి వెంటనే స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. రాష్ట్రంలో రహదారుల నిర్మాణం, అమరావతిని శాశ్వత రాజధానిగా గుర్తించటానికి చేపడుతున్న చర్యలు,పరిపాలనలో పారదర్శకత ఉండేలా ఆధునిక సాంకేతిక ద్వారా వాట్సాప్ సేవలు ఇతర అంశాలలో ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు అభినందనీయమని సురేష్ బాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులు,అధికారుల హక్కులను కాపాడుతూ వారి సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ కృషి చేస్తుందని సురేష్ బాబు తెలిపారు. మహిళా ఉద్యోగ సంఘ నేత బొకినాల సౌమ్య రేఖ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నేతలు తువ్వక రాజా రత్న రాజు, చిట్టూరి ప్రవీణ్ కుమార్, షేక్ అబ్బాస్, ఏ సులోచన, పులవర్తి ఎలీషా, జ్యోత్స్నా దేవి, సీహెచ్ రాణి కృపావరం, మేడేపల్లి సుబ్బారావు, వేణుగోపాలరావు, కోటయ్య, ఎస్. చినరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా సౌమ్య రేఖ

ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ఉంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్స్ గా పనిచేస్తున్న బొకినాల సౌమ్య రేఖను నియమించారు. ఈ మేరకు సమావేశంలో సురేష్ బాబుకు ఆమెకు నియామక ఉత్తర్వులు అందజేశారు. సౌమ్య రేఖ ఆంధ్రప్రదేశ్ స్టాఫ్ నర్స్ స్ట్రగుల్ కమిటీలో జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. రాష్ట్రంలో మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా సౌమ్య రేఖ తెలిపారు. సౌమ్య రేఖ ఎంపిక పట్ల పలువురు ఉద్యోగ సంఘ నేతలు,మహిళా ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

## జడ్పీ చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టీనాకు ఈస్టర్ శుభాకాంక్షలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టీనాను మంగళవారం క్యాంపు కార్యాలయంలో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం తరపున డైరీ అందించి, శాల్‌తో సత్కరించి ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

జడ్పీ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న కొన్ని సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లగా, సంబంధిత అధికారులతో చర్చించి వీటిని త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎన్.వి. జగదీష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు పీ. బాలస్వామి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహోత్సవంగా మల్లెపూల పూజ

**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** కొండపాటూరు పోలేరమ్మ తిరునాళ్లను పురస్కరించుకుని వారం రోజులు ముందుగా మంగళవారం రాత్రి దేవస్థానం వద్ద లక్ష మల్లెపూల పూజను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవం సందర్భంగా ఆకట్టుకునేలా అమ్మవారి అలంకరణ చేశారు. వేదపండితులు శాస్త్రోక్తంగా మంత్రాలు పఠిస్తుండగా అమ్మవారి ఉత్సవమూర్తిని వేదికపై కొలువుదీర్చి దంపతులతో పూజలు చేయించారు. పోలేరమ్మ దేవస్థానికి ఇరువైపుల కిక్కిరిసి పోయేలా వేలాదిగా మహిళలు కూర్చుని పూజల్లో పాల్గొన్నారు. పూజా సామగ్రిని దేవస్థానం వారు సమకూర్చారు . గత ఏడాదికంటే ఈ సంవత్సరం మహిళలు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. ట్రాక్టర్లు, ఆటోలు, మోటారు సైకిళ్లపై భక్తులు తరలి వచ్చారు. గుడి ప్రాంతాలను రంగరంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. పోలేరమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పొన్నం వీరయ్య చౌదరి, ఈవో జక్కా శ్రీనివాసరావు, బోర్డు సభ్యులు పర్యవేక్షించారు. పూజలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ వారు పూజా సామాగ్రిని పంపిణి చేశారు. పాల్గొన్న వేలాది మంది భక్తులకు ఉచితంగా భోజన సదుపాయాలను కల్పించారు. ఈ విషయంలో బాపట్లకు చెందిన అన్నం సతీశ్ ప్రభాకర్ ప్రతి ఏటా అన్నదానం చేస్తూ భక్తిప్రపత్తులను చాటుకుంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ శ్రీనివాసరావు, ఎస్ ఐ హరి కృష్ణ ల నేతృత్వం లో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



## కార్యకర్త కుటుంబానికి మంత్రి లోకేష్ అండ



- గతేడాది కర్నూలు వద్ద విద్యుత్ షాక్ తగిలి అర్జున్ మృతి
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో అర్జున్ కుటుంబాన్ని కలిసిన మంత్రి లోకేష్
- ధైర్యంగా ఉండాలని, జీవితాంతం అండగా ఉంటానని భరోసా

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు ఎప్పుడు, ఏ ఆపద వచ్చినా అండగా నిలిచే మంత్రి నారా లోకేష్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. గతేడాది కర్నూలు జిల్లా నన్నూరు వద్ద విద్యుత్ షాక్ తగిలి మునగాలపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఎమ్. అర్జున్ అనే యువకుడు మృతిచెందాడు. ఈ నేపథ్యంలో అర్జున్ కుటుంబ సభ్యులను మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి మంత్రి పిలిపించారు. దివంగత అర్జున్ తల్లిదండ్రులు మస్టిక్ మద్దిలేటి, రాణితో పాటు సోదరి కోమలితో మంత్రి ప్రత్యేకంగా మాట్లాడారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అర్జున్ మరణం బాధించిందని చెప్పారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అర్జున్ సోదరి కోమలి చదువు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ బాధ్యత తాను తీసుకుంటానని, జీవితాంతం అండగా ఉంటానని మంత్రి వారికి భరోసా ఇచ్చారు. తమ కుటుంబానికి అండగా నిలవడం పట్ల మంత్రి నారా లోకేష్ కు అర్జున్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## కుటుంబ పాలన తమిళనాడును దోచుకుంటుంది

**చెన్నై(జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చెన్నైలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేవలం ఒకే కుటుంబం పాలన సాగుతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, ఎంపీ కనిమొళి.. ఇలా కుటుంబ సభ్యులంతా కలిసి తమిళనాడును దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ కుటుంబ పాలన వల్ల దేశవ్యాప్తంగానే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా తమిళనాడు ప్రతిష్ట దెబ్బతిన్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

తమిళ సంస్కృతి, భాష మరియు సాహిత్యానికి తమ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని గోయల్ పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందడానికి అవసరమైన అన్ని వనరులు తమిళనాడులో ఉన్నాయని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ సంభావ్యతను నీరుగారుస్తోందని అన్నారు. ప్రధాని మోదీ మార్గదర్శకత్వంలో, ఈపీఎస్ నాయకత్వంలోని ఎన్డీయే కూటమి తమిళనాడుకు పూర్వ వైభవాన్ని తీసుకువస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గత ఐదేళ్లుగా ప్రజలు కోరుకుంటున్న సుపరిపాలనను అందించి, తమిళ గర్వాన్ని, గొప్ప సంప్రదాయాలను కాపాడతామని ఆయన స్పష్టం చేశారు.



# భారత్ ఆర్థిక దూకుడు... గ్లోబల్ వేదికపై పెరుగుతున్న ప్రభావం

- వృద్ధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలతో ముందుకు సాగుతున్న దేశం

ప్రస్తుతం భారతదేశం ప్రపంచ ఆర్థిక వేదికపై ఒక ప్రధాన శక్తిగా ఎదుగుతోంది. గ్లోబల్ ఆర్థిక అనిశ్చితి మధ్య కూడా భారత్ స్థిరమైన వృద్ధిని నమోదు చేస్తూ, అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఒక ఆదర్శంగా నిలుస్తోంది. తాజా ఆర్థిక పరిణామాలు, పెట్టుబడుల ప్రవాహం, మౌలిక సదుపాయాల విస్తరణ–అన్నీ కలిసి దేశాన్ని కొత్త దిశలో నడిపిస్తున్నాయి.

ఈరోజు ప్రధాన కరెంట్ అఫైర్స్‌లో ఒకటి భారత ఆర్థిక వృద్ధి వేగం. అంతర్జాతీయ సంస్థలు కూడా భారత్‌ను ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా గుర్తిస్తున్నాయి. తయారీ, సేవల రంగాలు, డిజిటల్ ఎకానమీ–అన్ని రంగాల్లో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది.


విదేశీ పెట్టుబడులు కూడా భారత్ వైపు మళ్లుతున్నాయి. పెట్టుబడిదారులు భారత మార్కెట్‌పై నమ్మకం పెంచుకుంటున్నారు. స్టార్టప్ వ్యవస్థ, తయారీ రంగం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్–అన్నీ ఈ రంగాలు పెట్టుబడులకు ఆకర్షణగా మారాయి. "మేక్ ఇన్ ఇండియా", "డిజిటల్ ఇండియా" వంటి కార్యక్రమాలు ఈ దిశగా కీలక పాత్ర పోషిస్తున్నాయి.

మౌలిక సదుపాయాల అభివృద్ధి కూడా దేశ ప్రగతికి బలంగా మారుతోంది. కొత్త రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు, రైల్వే ప్రాజెక్టులు, విమానాశ్రయాలు–అన్నీ దేశ కనెక్టివిటీని మెరుగుపరుస్తున్నాయి. ఇది వాణిజ్యాన్ని వేగవంతం చేస్తూ, ఉపాధి అవకాశాలను పెంచుతోంది.

అయితే ఈ అభివృద్ధి ప్రయాణంలో కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. నిరుద్యోగం, ధరల పెరుగుదల, గ్రామీణ ఆర్థిక సమస్యలు వంటి అంశాలు దృష్టి సారించాల్సినవిగా ఉన్నాయి. అభివృద్ధి ప్రయోజనాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా చర్యలు తీసుకోవాలి.

ప్రస్తుతం భారత్ ఒక కీలక దశలో ఉంది. ఒకవైపు వేగవంతమైన ఆర్థిక వృద్ధి, మరోవైపు సామాజిక సమగ్రత–ఈ రెండింటి మధ్య సమతుల్యత అవసరం. ప్రభుత్వ విధానాలు, ప్రైవేట్ రంగం, ప్రజల భాగస్వామ్యం అన్నీ కలిసి దేశ భవిష్యత్తును నిర్మిస్తున్నాయి.

మొత్తంగా చూస్తే, భారత్ ఆర్థికంగా ఒక బలమైన దిశలో ముందుకు సాగుతోంది. సవాళ్లను ఎదుర్కొంటూనే అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ, దేశం గ్లోబల్ వేదికపై తన స్థాయిని మరింత బలోపేతం చేసుకుంటోంది. ఇదే వేగం కొనసాగితే, భారత్ ప్రపంచంలో అగ్ర స్థానానికి చేరుకోవడం దూరం కాదు.



రచన:
వై.వి. సుబ్బారావు
ఎంబీఏ, ఎంఏ (జర్నలిజం)

# కొరకల్ గ్రామంలో శ్రీ బొడ్రాయి నాభి శిల

## శంకుస్థాపన మహోత్సవం



**(జర్నలిస్ట్ ఫైల్), ములుగు జిల్లా వాజేడు మండలం**

కోరకల్లు గ్రామంలో శ్రీ బొడ్రాయి నాభిశీల శంకుస్థాపన దేవతలు శ్రీ భూలక్ష్మి శ్రీ మహాలక్ష్మి సమేత శ్రీ భువనేశ్వర స్వామి నాగులమ్మ దేవత మరియు శ్రీ ముత్యాలమ్మ గ్రామ దేవతల శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమం. కొరకల్ గ్రామంలో , గ్రామ పెద్దలు భూమి పూజ నిర్వహించారు. ఈ భూమి పూజకి, పురోహితులు, బ్రహ్మ శ్రీ, కిస్టోజు రవీంద్ర చార్యులు మరియు అనిల్ శాస్త్రి గారు, మరియు గ్రామ పెద్దలు, గ్రామ ఆడపడుచులు, అందరూ ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నాగిరెడ్డిపూర్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమము




**గంగాధర్, (జర్నలిస్ట్ ఫైల్) :**

గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం లో గ్రామ సర్పంచ్ గునుకొండ యశోద అధ్యక్షతన సోమవారం రోజున పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో ఉప తహశీల్దార్ కళావతి , ఐకేపీ , ఉపాధి హామీ ప్రాజెక్ట్ అధికారి, పోలీస్ సిబ్బంది ,ఎవశీ కార్యాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు,పంచాయతీ సెక్రెటరీ, మరియు ఇతర శాఖల సిబ్బంది, ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యులు మరియు అంబేద్కర్ సంఘాల ప్రతినిధులు ప్రవీణ్, శ్రీనివాస్, సురేష్, రాజయ్య, మాజీ సర్పంచ్ కర్ర విద్యాసాగర్ రెడ్డి, గునుకొండ బాబు తదితరులు పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమమును ఉద్దేశించి ఉప తహశీల్దార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆర్టికల్ 17 ప్రకారం అంటరాని తనం అనేది నిషేదించడం మరియు పూర్తి గా నిర్మూలించడం జరిగినదని, సమాజంలో పౌరులు అందరూ సమానమేనని,స్వేచ్ఛ, సౌభ్రాతృత్వంతో అందరూ కలసి మెలసి జీవించాలని, పౌరులు అందరూ చట్టాల పట్ల అవగాహన పెంచుకొని తధనుగుణంగా నడుచుకోవాలని,హోటల్ లో రెండు గ్లాసుల విదానంగాని, గుడిలోనికి ప్రవేశ విషయములో గాని వివక్ష చూపవద్దని అలా ఎవరైనా ప్రవర్తిస్తే చట్ట రీత్యా నేరం అని మరియు దానికి బాద్యులు అవుతారని తెలియపరచ్చినారు.

# సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**తాండూర్, (జర్నలిస్ట్ ఫైల్) :**

తాండూర్ మండలంలోని మాదారం త్రీ ఇంక్లైన్ గ్రామంలో సోమవారం సిసి రోడ్డు పనులను సర్పంచ్ చందనాల రవికుమార్ ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ సింగరేణి మెయిన్ రోడ్డు నుంచి సత్తిరెడ్డి ఇంటి వరకు రూ.4లక్షలు ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ సాయిలత, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండి ఈసా, ఉప సర్పంచ్ చింతపూరి మల్లేశ్వరి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టుకు పాదయాత్ర..



**తాండూర్, (జర్నలిస్ట్ ఫైల్) :**

తాండూర్ మండలం ద్వారకపూర్ గ్రామం నుంచి హనుమాన్ దీక్ష స్వాములు కొండగట్టుకు దీక్ష విరమణ కోసం 18 మంది పాదయాత్రగా బయలుదేరారు. గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం యాత్రను ప్రారంభించారు. స్వాములకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. 41,21,11 రోజులపాటు నియమనిష్టలతో, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించిన దీక్ష స్వాములు కొండగట్టుకు పాదయాత్రగా వెళ్తున్నామని హనుమాన్ దీక్ష స్వాములు తెలిపారు.

## ఇందిరమ్మ కాలనీ పరిశీలించిన సబ్ కలెక్టర్



**తాండూర్, (జర్నలిస్ట్ ఫైల్) :**

తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీని సోమవారం రోజున బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ పరిశీలించారు. 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో అర్హులైన నిరుపేదలకు ఇళ్ల పట్టాలు అందజేశారు. అప్పటి నుంచి నేటి వరకు ఆ కాలనీలో విద్యుత్, మంచినీటి సమస్య, అందుబాటులో లేకపోవడంతో ఆ కాలనీలో నేటి వరకు ఇళ్ల నిర్మాణం ఎవరు చేపట్టలేదు. అర్హులైన లబ్ధిదారులు అందరూ కలిసి తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎన్నో సంవత్సరాలుగా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. ఈ నేపథ్యంలో సబ్ కలెక్టర్ కూడా ఈరోజు వచ్చి ఆ కాలనీని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి పూర్తి వివరాలను తెలుసుకున్నారు. ఇట్టి నివేదికను తయారు చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుందని సబ్ కలెక్టర్ తెలిపారు. ఆయన వెంట తహసిల్దార్ జోత్స్న ,సర్పంచ్ ఆకుల వెంకటేష్ ,ఎంపీడీవో శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఏఈ జాన్, ఎంపిఓ అనిల్ కుమార్, ఆర్ఐ ఎజాజుద్దీన్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, లబ్ధిదారులు, పలువురు నాయకులు ఉన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై వేగవంతమైన పరిష్కారం అవసరం

## జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :**

జిల్లాలో ప్రజావాణి ద్వారా అందుతున్న ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.నిన్న కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో, అదనపు కలెక్టర్లు మరియు ఆర్డీవోలతో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. అధికారులు తమ శాఖల వారీగా అందిన ఫిర్యాదులపై సానుకూల దృక్పథంతో స్పందిస్తూ, సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.నిన్న నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 74 ఫిర్యాదులు, వినతులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. వాటిని సంబంధిత శాఖలకు పంపించి, వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజగౌడ్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, నరసింహారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# ఎండిపోయిన పంటలకు వెంటనే నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలి

## కొప్పుల వెంకటేష్

**గంగాధర్, (జర్నలిస్ట్ ఫైల్) :**

చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండలం, ఉప్పర మల్యాల గ్రామ రెవెన్యూ పరిధిలో నీటి కొరత కారణంగా ఎండిపోయిన పంట పొలాలను తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు కొప్పుల వెంకటేష్ సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చొప్పదండి నియోజకవర్గానికి సంబంధించిన నారాయణపూర్ రిజర్వాయర్ కుడి కాలువ పూర్తిస్థాయిలో నిర్మాణం జరగకపోవడంతో పరిసర గ్రామాల రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పెర మల్యాల వెంకంపల్లి గ్రామానికి చెందిన రైతులు మల్యాల అనిల్, మధుసుదన్ రెడ్డి,ముక్కెర పర్శరాములు తదితరుల ఎండిపోయిన పంటలను పరిశీలించి, వారి పరిస్థితిని తెలుసుకున్నారు. చెరువుకు కేవలం మూడు వందల మీటర్ల దూరంలో ఉన్న పొలాలు కూడా నీటి లభ్యత లేక ఎండిపోవడం చాలా దురదృష్టకరమని తెలిపారు. కుడి కాలువ నిర్మాణం పూర్తి కాకపోవడం వల్ల రైతులు తీవ్రంగా



నష్టపోతున్నారని, గౌరవ ఎమ్మెల్యే గారు ఇచ్చిన హామీని నిలబెట్టుకొని తక్షణమే కాలువ పనులు పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30,000 చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం వెంటనే అందించాలని కోరారు. ఈ



కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇంచార్జ్ కొప్పుల వెంకటేష్, గంగాధర మండల అధ్యక్షుడు ముక్కెర గంగరాజు, యువజన విభాగం అధ్యక్షుడు పలుమారి సతీష్, యూత్ ప్రధాన కార్యదర్శి బండ గంగరాజు, గుండవేణి నరేష్ మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# గిరిగుట్ట కనకదుర్గ ఆలయానికి దారి చూపాలని ప్రజావాణిలో వినతి

**రాయికల్ (జర్నలిస్ట్ ఫైల్) :**

రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలోని గిరిగుట్ట (గన్నెగుట్ట) పై ఉన్న కనకదుర్గమ్మ ఆలయానికి రహదారి సమస్య తీవ్రరూపం దాల్చింది. వందేళ్లుగా ఉన్న మార్గం ప్రకారం భక్తులు, రైతులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, ఇటీవల సిమెంట్ రహదారి నిర్మాణ పనులు వివాదంలో నిలిచిపోయాయి.

రాజ్యసభ సభ్యుడు దినకోండ దామోదరరావు నిధుల నుంచి రూ.15 లక్షలు మంజూరు కాగా, పనులు ప్రారంభమైన సమయంలో కొంతమంది భూస్వాములు అభ్యంతరం వ్యక్తం చేస్తూ పనులను అడ్డుకున్నారు. రహదారి లేదని వాదిస్తూ, పనులు కొనసాగితే తీవ్ర చర్యలకు దిగుతామని హెచ్చరించడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.




ఈ విషయంపై స్థానిక నాయకులు పలుమార్లు తహసీల్దార్ కార్యాలయానికి వినతిపత్రాలు సమర్పించినప్పటికీ అధికారులు స్పందించలేదని ఆరోపించారు. సర్వేయర్లు పలుమార్లు వచ్చి పరిశీలించినా సమస్యకు పరిష్కారం చూపలేదని విమర్శించారు.రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న ఈ ఆలయానికి భక్తుల రాక పెరుగుతుండటంతో, తక్షణమే భూ హద్దులు నిర్ధారించి రహదారి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మంజూరైన నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ మేరకు ప్రజావాణి కార్యక్రమంలో అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అనుమల్ల రమ, బుస గంగ మల్లయ్య, భూపల్లి పరమేశ్వర్, తొగిటి నవీన్ కుమార్,అనుమల్ల సత్యనారాయణ,మాదిరి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# కళాకారులు సంస్కృతి వారసత్వానికి వారధులు

## వడ్డేపల్లి రాంచందర్, మేయర్ మహంకాళి స్వామి





**(జర్నలిస్ట్ ఫైల్) : రామ్ మందిర్ ఏరియా**

గోదావరిఖని కళాకారులు చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలను ముందున్న తరాలకు అందించే వారధులని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్, రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు.

తారా ఆర్ట్స్ అకాడెమీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి మార్కండేయ కాలనీలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఉగాది కళోత్సవాలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై వివిధ రంగాలలో విశేష ప్రతిభ కనబరిచిన వారికి “ఉగాది” మరియు “నల్లవజ్రం” పురస్కారాలను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా వడ్డేపల్లి రాంచందర్ మాట్లాడుతూ కళలు, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో కళాకారుల పాత్ర అమోఘమని అన్నారు. మన పారిశ్రామిక ప్రాంతంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న కళాకారులు ఉన్నారని, శాస్త్రీయ సంగీతం, నృత్యాలు మన సంస్కృతికి ప్రతీకలని తెలిపారు. పిల్లల్లో కళలపై ఆసక్తి పెంపొందించేందుకు కళాకారులను ప్రోత్సహించాలని సూచించారు.మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజల్లో చైతన్యం కలిగించడంలో కళాకారుల పాత్ర కీలకమైందన్నారు. ఈ ప్రాంతంలో కళాకారులకు వేదికల కొరత ఉందని, గత 2025 సంవత్సరాలుగా ప్రైవేట్ ఫంక్షన్ హాల్స్‌పైనే ఆధారపడుతున్నారని తెలిపారు.2004లో కళాభవన్ నిర్మాణానికి బీజం పడినప్పటికీ ఇంకా పూర్తి కాలేదని, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సంకల్పంతో రెండు సంవత్సరాల్లో ఆధునాతన కళాభవన్ నిర్మించి కళాకారులకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.రామగుండం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, 800 మెగావాట్ల కొత్త విద్యుత్ ప్రాజెక్టుకు క్యాబినెట్ ఆమోదం లభించిందని పేర్కొన్నారు. పారిశ్రామిక కాలుష్యాన్ని తగ్గించేందుకు మొక్కలు నాటాలని, నగరాన్ని స్వచ్ఛంగా ఉంచాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన తారా ఆర్ట్స్ అకాడెమీ అధ్యక్షులు సంకె రాజేష్‌ను వారు అభినందించారు. స్థానికంగా ఎదిగి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చేరిన కళాకారులు ఇతర ప్రతిభావంతులను ప్రోత్సహించడం అభినందనీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, అధికారులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# అసెంబ్లీలో రేషన్ బియ్యంతో భోజనం చేసిన ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్

## ప్రభుత్వంపై నాణ్యత నమ్మకానికి ప్రతీక

**(జర్నలిస్ట్ ఫైల్) : రామ్ మందిర్ ఏరియా**

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో నిరుపేద కుటుంబాలకు రేషన్ కార్డుల ద్వారా అందజేస్తున్న సన్నబియ్యం నాణ్యతపై విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ రాష్ట్ర అసెంబ్లీలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

గౌరవ ముఖ్యమంత్రి A. Revanth Reddy ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, రాష్ట్ర మంత్రులు మరియు ప్రభుత్వ సలహాదారులతో కలిసి రేషన్ బియ్యంతో సిద్ధం చేసిన భోజనాన్ని స్వీకరించారు.

ప్రజలకు సరఫరా చేస్తున్న ఆహార ధాన్యాల నాణ్యతపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడం, ప్రభుత్వ పారదర్శకతను తెలియజేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, నిరుపేదల సంక్షేమం పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజలకు అందజేస్తున్న రేషన్ బియ్యం నాణ్యతపై ఎలాంటి సందేహాలు అవసరం లేదని పేర్కొన్నారు.

ప్రజల ఆరోగ్యం, పోషకాహారం దృష్ట్యా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని ఈ కార్యక్రమం ద్వారా స్పష్టమైందని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు నిరంతరం కృషి చేస్తోందని, సంక్షేమ కార్యక్రమాల అమలులో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తోందని



పేర్కొన్నారు.

## పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మక్కల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి..

**పెద్దపల్లి, (జర్నలిస్ట్ ఫైల్) :**

పెద్దపల్లి జిల్లాలో మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ జాతీయ బీసీ సంఘం నేషనల్ కోఆర్డినేటర్ మున్నూరుకాపు యూత్ రాష్ట్ర కన్వీనర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ , జిల్లా అదనపు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.సోమవారం ప్రజావాణి సందర్భంగా పెద్దపల్లి కలెక్టరేట్లో మక్కలు మక్కజొన్న కొనుగోలు కేంద్రాలు చేయాలని ఉమ్మడి జిల్లాలో వరి తర్వాత మొక్కజొన్న రెండో ప్రధానపంట సాగుతుందని , మెట్ట ప్రాంతాలు బోరుల కింద మొక్కజొన్న పంటను సాగు చేసి రైతులు ఆదాయం సమకూర్చుకుంటున్నారని ఈ సీజన్లో ఉమ్మడి జిల్లా పరిధిలో 95,900 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారని దాదాపుగా మూడు లక్షల టన్నుల దిగుబడి అంచనా వేస్తున్నారని పెద్దపల్లి జిల్లాలో 18,851 ఎకరాలలో మొక్కజొన్న సాగు చేస్తా ఉన్నారని,కరీంనగర్ జిల్లాలో 30,242 జగిత్యాల జిల్లాలో 42,500 రాజన్న సిరిసిల్ల జిల్లా 4308 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఒక చొప్పదండిలో మాత్రమే ఏర్పాటు చేశారనిపెద్దపల్లి జిల్లాలో ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.ఇక పెద్దపల్లి జిల్లా విషయానికొస్తే పెద్దపల్లి జిల్లాలో ప్రధానంగా కాల్వ శ్రీరాంపూర్ మండలంలో మొక్కజొన్నను అత్యధికంగా పండిస్తున్నారనికాల్వ శ్రీరాంపూర్ మండలం తో పాటు కాల్వ శ్రీరాంపూర్, ఓదెల, ధర్మారం, జూలపల్లి , మండలాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను అత్యంత త్వరగా ప్రారంభించాలని ఈ సందర్భంగా జాతీయ బీసీ సంఘం నేషనల్ కోఆర్డినేటర్ మున్నూరుకాపు యూత్ రాష్ట్ర కన్వీనర్ సామాజిక కార్యకర్త ఆకుల స్వామి వివేక్ పటేల్ విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో ఆకుల స్వామి వివేక్ పటేల్ తో పాటు సామాజిక కార్యకర్త కోమటిపల్లి రాజేందర్ నేత, జాగీలపు నర్సింగం ఉన్నారు



## మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దు బ్రో



○ గుంటూరు జిల్లా యువతకు జేసి పిలుపు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :మాదక ద్రవ్యాల జోలికి వెళ్ళవద్దని యువతను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మత్తు మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యా సంస్థలలలో మాదక ద్రవ్యాలు ప్రవేశించకుండా గట్టి నిఘా పెట్టాలని తెలిపారు. యువత మత్తులో పడితే జీవితం చిత్తు అవుతుందని, కుటుంబాలు ఆర్థికంగా నష్ట పోతాయని, ఆరోగ్యం దెబ్బతింటుందని అన్నారు. తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. యువత ఉన్నత విద్యా ఉద్యోగ అవకాశాలు దిశగా యోచించే విధంగా సమష్టిగా కృషి చేయాలని కోరారు. యువత సమాజానికి గొప్ప సంపద అని, యువతను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. మత్తు మాదక ద్రవ్యాలు రవాణా, సరఫరా, ఉత్పాదకత, క్రయ విక్రయాలు పై గట్టి నిఘా పెట్టాలని అన్నారు. అదనపు పోలీస్ సూపరింటెండెంట్ జి. వి. రమణ మూర్తి మాట్లాడుతూ మత్తు మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. మత్తు మాదక ద్రవ్యాల రవాణా, సరఫరా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశామని, హాట్ స్పాట్ లు, ఉపయోగంలో లేని భవనాలు గుర్తించామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ప్రాంగణానికి బ్యాంకు ఆఫ్ ఇండియా వితరణ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :మహిళా ప్రాంగణానికి బ్యాంకు ఆఫ్ ఇండియా (బి.ఓ.ఐ) మహిళ ఉద్యోగులు రూ. 94 వేల విలువ చేసే సామాగ్రిని వితరణగా అందజేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా విజయవాడ జోన్‌లోని బి.ఓ.ఐ మహిళా ఉద్యోగులు సామాజిక సేవల కోసం సమకూర్చిన నిధులతో, గుంటూరులోని మహిళా ప్రాంగణంలో సి. ఎస్. ఆర్ కార్యక్రమం క్రింద అందించారు. మహిళా ప్రాంగణం మహిళలకు ఆశ్రయం కల్పించే స్థలంగా పనిచేస్తోంది. ప్రాంగణంలో ఉచితంగా కంప్యూటర్ విద్య, బ్యూటీషియన్ కోర్సులు, కుట్టు శిక్షణ వంటి కార్యక్రమాలను అందించి, మంచి భవిష్యత్తు కోసం నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేలా సహాయపడుతోంది. బ్యాంకు ఆఫ్ ఇండియా మహిళ ఉద్యోగులు నివాసితులకు కుర్చీలు, మంచాలు, పడకలు, వాటర్ ప్యూరిఫైయర్లు వంటి అవసరమైన సామగ్రిని కొనుగోలు చేశారు. ఈ మేరకు మంగళవారం మహిళా ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె. సుప్రజ ముఖ్య అతిథిగా హాజరై సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సి. ఎస్. ఆర్ కార్యక్రమం చేపట్టడం శుభ సూచకం అన్నారు. వ్యక్తులు, సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ ఎం. వి. వి. బంగారు రాజు, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన, తదితరులు పాల్గొన్నారు.

## టిఫిన్, తోపుడు, ప్లాట్ ఫామ్ రిక్షాలు పంపిణీ



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి నియోజకవర్గంలోని పలువురికి మంత్రి నారా లోకేష్ సహకారంతో టిఫిన్, తోపుడు, ప్లాట్ ఫామ్ రిక్షాలను టీడీపీ నాయకులు మంగళవారం అందజేశారు. మంగళగిరి పట్టణంలోని 3వ వార్డుకు చెందిన గరిక రాములకు ప్లాట్ ఫామ్ రిక్షా, 29వ వార్డుకు చెందిన బిట్రా భానుకుమార్, 5వ వార్డుకు చెందిన గెద్దం మాధవిలకు టిఫిన్ బళ్లు, 21వ వార్డుకు చెందిన కటారి రమణకు తోపుడు బండి అందజేశారు. నవులూరు గ్రామానికి చెందిన సయ్యద్ మస్తాన్‌బీకి టిఫీన్ బండి, నూతక్కి గ్రామానికి చెందిన నూతక్కి అమూర్తమ్మకు తోపుడు బండి, నుసావత్ శ్రీనునాయక్‌కు ప్లాట్ ఫామ్ రిక్షా, నాయర్ ఉన్ని కృష్ణన్‌కు, కొరటాని కనకదుర్గకు టిఫిన్ బళ్లు అందజేశారు. అలాగే తాడేపల్లి 23వ వార్డుకు చెందిన శ్రీపతి మారుతమ్మకు తోపుడు బండి అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ పార్టీ అధ్యక్షులు పడవల మహేష్ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ మొదటి నుంచి చిరువ్యాపారులకు అండగా నిలిస్తున్నారని చెప్పారు. మంత్రి నారా లోకేష్ అందజేస్తున్న సంక్షేమ పథకాలు ఎందరో కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, వాసా పద్మ, షేక్ రియాజ్, మల్లవరపు వెంకట్, గాజుల శ్రీనివాస్, కొల్లి సీత రామిరెడ్డి, వల్లూరూ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## నాగిశెట్టిపల్లి రెవెన్యూ పొలంను కబ్జాదారుల నుంచి కాపాడి అర్హులకు ఇవ్వాలి



**బ్రహ్మంగారి మఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారిమఠం మండలంలోని నాగిశెట్టి పల్లె రెవెన్యూ పొలం సర్వేనెంబర్ 5ను ఆక్రమణదారుల నుండి కాపాడి అర్హులకు ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల కార్యదర్శి పెద్దల్లపల్లి ప్రభాకర్ డిమాండ్ చేశారు ఆయన మాట్లాడుతూ నాగేశెట్టిపల్లె రెవెన్యూ పొలం సర్వేనెంబర్ 5 నందు 1996 సంవత్సరంలో ఎస్సీలకు అక్కడ డి పట్టాలు మంజూరు చేయడం జరిగింది . అయితే ఎస్సీలు జీవనోపాధి రీత్యా వేరే గ్రామాలకు వెళ్లడంతో ఆ భూమిపైన కన్నేసిన కొందరు భూకబ్జాదారులు అక్రమంగా ఆన్లైన్ చేసుకొని ఈ పొలం మాది అంటూ ఎస్సీలను బెదిరిస్తున్నారు. 1996 సంవత్సరంలో డి పట్టాలు పొందిన ఎస్సీ మాదిగలకు చెందిన పొలాన్ని వారికె ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు ఆక్రమాదారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఉద్యమాల ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## సమాజ సేవ అభినందనీయం : ఎమ్మెల్యే నసీర్

○ చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగం

○ మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నసీర్

○ వివిధ ప్రాంతాల్లో శ్రీరామనవమి వేడుకలకు హాజరు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రతి ఒక్కరూ సమాజసేవలో తమ వంతు భాగస్వాములు కావాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం గుంటూరులో వివిధ కార్యక్రమాలలో ఎమ్మెల్యే నసీర్ పాల్గొన్నారు. తొలుత కోర్టు ప్రాంగణంలో జనసేన నాయకులు దార్ల మహేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. వేసవికాలంలో మజ్జిగ, మంచి నీరు పంపిణీ చేయడం మంచి విషయమని చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే ప్రజల కోసం చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం కాకాని రోడ్డులోని వాసవి కన్యకా పరమేశ్వరి కాంప్లెక్స్, సంగడిగుంటలోని రెడ్ల రామాలయం వద్ద శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యేల పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ స్వయంగా అన్నదానం చేశారు. శ్రీరామచంద్రమూర్తి పరిపాలన అన్నియుగాలకు ఆదర్శమని చెప్పారు. ఆయన ధర్మం సత్యం మార్గాన్ని అనుసరిస్తే జీవితం ఆనందకరంగా మారుతుందని పేర్కొన్నారు.

## ఘనంగా మా ఏపి అష్టదిగ్గజ ఉగాది పురస్కారాలు

○ అతిధులు పాల్గొన్న ఉన్నతాధికారులు డిఎస్పీ బి. జనార్ధనరావు, తహశీల్దార్ కెవి. గోపాలకృష్ణ, కమీషనర్ జె.ఆర్. అప్పలనాయుడు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** సమాజం పట్ల బాధ్యతగా, ఫలాపేక్ష రహితంగా, విభిన్న రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న వ్యక్తులను గుర్తించి, అష్టదిగ్గజాల పేరిట వారికి ఉగాది పురస్కారాలు అందజేయడంలో, దర్శకులు దిలీప్ రాజా కృతకృత్యులయ్యారనిఎంపిక చేసిన వ్యక్తులందరూ నిస్వార్థ ప్రజాసేవకులని, అతిథులుగా పాల్గొన్న వక్తలు తమ ప్రసంగాల్లో, మా ఏపీ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.

సుల్తానాబాద్ ఆలపాటి నగర్ లోని రత్న ఫార్చ్యున్ కల్యాణమండపంలో, మా ఎపి, వ్యవస్థాపకులు దిలీప్ రాజ పత్యక్ష పర్యవేక్షణలో, వివిధ రంగాల ద్వారా సమాజానికి, నిస్వార్థ సేవలు అందిస్తున్న, ఎనిమంది సేవా తత్పరులకు, అష్ట దిగ్గజాలు పేరిట మంగళవారం ఉగాది పురస్కారాలు ఏర్పాటు చేశారు. ఈ విశిష్ట కార్యక్రమాలకు పురస్కార గ్రహీతలుగా, దశాబ్దాలుగా కుష్టురోగులకు ఎయిడ్స్ పీడితులకు సాయం చేస్తున్న హార్వెస్ట్ ఆఫ్ ఇండియా అదినేత కత్తెర సురేష్ కుమార్,అనాధ శవాలకు అంతిమ సంస్కారాలు చేస్తున్న, శ్రీ శివలింగేశ్వర భక్త బృంద సేవ సమితి అధ్యక్షులు కుర్రా శ్రీను,డి-3 శారద సర్వీసెస్ సొసైటీ నిర్వాహకులు డాక్టర్ శారద,మహాత్మా సేవా శాంతి వృద్ధాశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి,కూచిపూడి నృత్య కళాకారిణీ తేజస్వీ ప్రఖ్య,షార్ట్ ఫిలిమ్స్ ఉత్తమ నటి సుజిత, యూట్యూబ్ ఉత్తమ కేరెక్టరు నటి సాయిప్రకర్షలకు మా-ఎపి ఉగాది పురస్కారాలను వినూత్న రీతిలో అందించారు. దిలీప్ రాజా అధ్యక్షతన నిర్వహించిన ఉగాది పురస్కార సభలో, మండల తహశీల్దార్ కెవి. గోపాలకృష్ణ, మున్సిపల్ కమీషనర్ జె. రామ అప్పల నాయుడు, డిఎస్పి బి. జనార్ధనరావు లు విశిష్ట అతిథులుగా పాల్గొని, పురస్కార గ్రహీతలను సముచిత రీతిన సత్కరించారు. సత్కార గ్రహీతలు ఆయా రంగాలలో అందిస్తు, నిస్వార్థ సేవలను ప్రశంశించారు. దిలీప్ రాజ మాట్లాడుతు, ప్రభుత్వం నుండి తమ సంస్థకు ఆమోదం లభించి ఇప్పటికి ఎనిమిది సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా, ఎనిమిది మంది ప్రతిభావంతుల, ప్రతిభకు ఉగాది పురస్కారాలను ప్రధానం చేసామని తెలిపారు. ఈకార్యక్రమంలో పెదరవూరు ఫిలిం స్టూడియోస్ మేనేజర్ పినపాటి సురేష్ బాబు,నటుడు మిలటరీ ప్రసాద్, అంబటి మురళీ, పలవురు నటులు,మాఎపి కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చేబ్రోలులో మంచి నీటి పథకాలు తనిఖీ

○ తాగు నీటి ఎద్దడిని నివారించేందుకు చర్యలు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :గ్రామం లో ఎండాకాలం దృష్ట్యా తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ఆర్ డబ్ల్యు ఎస్ ఎ ఈ , పంచాయతీ అభివృద్ధి అధికారి కలిసి రక్షిత మంచినీటి పథకంను తనిఖీ చేశారు . సందర్భముగా ఎ ఈ పి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాబోయే ఎండాకాలం దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా మంచినీటి చెరువుల్లో 100% నీటి నిల్వలు ఉండేలా చేయటం జరిగింది అన్నారు .అనంతరం ప్లాంటు పని తీరును పరిశీలించారు. కంప్లైంట్ ఉన్న ప్రాంతాలు, రిపేరు అవసరం ఉన్న చోట నీటి సరఫరా పైప్లైన్లు మరమ్మత్తులపై సిబ్బందికి పలు సూచనలు చేశారు . ఎట్టి పరిస్థితుల్లోనూ నీరు కలుషితం కాకూడదని సిబ్బందిని ఆదేశించారు ఆదేశించారు. ఏమైనా నీటి సరఫరా లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అదేవిధంగా పంచాయతీ అభివృద్ధి గారికి తెలియజేయాలని చెప్పారు. సందర్భముగా రక్షిత మంచినీరును ఏ ఈ మరియు పంచాయతీ అభివృద్ధి అధికారి స్వయంగా తాగి త్రాగునీటి నాణ్యతను అసిస్టెంట్ ఇంజనీరు ఆర్డబ్ల్యూఎస్ అండ్ పి శ్రీనివాసరావు మరియు చేబ్రోలు పంచాయతీ అభివృద్ధి అధికారి కె శ్రీనివాసరావు . పరిశీలించారు . ప్రతిరోజు ఫిల్టర్ చేసిన నీటిని, క్లోరినేషన్ చేసిన తరువాత మాత్రమే గ్రామ ప్రజలకు సరఫరా చేయాలని సిబ్బందికి ఆదేశించారు. తప్పనిసరిగా నీటి నాణ్యత పరీక్షలు చేసి వచ్చిన ఫలితాలను రికార్డులో నమోదు చేయాలి సూచించారు. అదేవిధంగా చెరువు పరిసరాలు ట్యాంకు పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని మరియు గ్రామంలో ఎక్కడ వాటర్ పైప్ లైన్లు లీకులు లేకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. సొంపు , వాటర్ ట్యాంక్, రాపిడ్ శాండ్ ఫిల్టర్ మరియు సంపుని ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలి డిస్ప్లే బోర్డుపై ఖచ్చితంగా రాసి ఉంచాలన్నారు . సందర్శనలు ఇంజనీరింగ్ అసిస్టెంట్ మంజూష స్వచ్ఛభారత్ మిషన్ మండల కోఆర్డినేటర్ జి ప్రసాద్ ప్లాంట్ నిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు .

## బ్రహ్మంగారిమఠంలో బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి




**బ్రహ్మంగారి మఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మంగారిమఠం లో బస్ షెల్టర్ లేక భక్తులు, గ్రామస్తులు, యాత్రికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని వారి ఇబ్బందులను గమనించి వెంటనే మఠం 5 రోడ్ల సెంటర్ లో బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. శివకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం నాడు జూవీ మండల కమిటీ ఆధ్వర్యంలో మఠం 5,రోడ్ల సెంటర్ లో గొడుగులు, ధాన్యంపట్ట, నీడగా పెట్టుకుని వినూత్న ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ తో కలసి వారు మాట్లాడుతూ భూత భవిష్యత్తు వర్తమాన కాలాలను తత్వాల ద్వారా ప్రపంచానికి తెలియజేసి కాలం మార్పును ప్రపంచానికి చూపిన యోగి, కులం గోడలను కూల్చిన భోగి శ్రీ పోతులూరి వీర బ్రహ్మంగారి సజీవ సమాధి వహించిన గొప్ప ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం బ్రహ్మంగారి మఠం అని వారన్నారు. ఇటువంటి పుణ్యక్షేత్రంలో బస్సు షెల్టర్ లేక వివిధ రాష్ట్రాల నుండి దేశ విదేశాల నుంచి వచ్చే యాత్రికులు భక్తులు, మండల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని వారు ఆవేదన వెళ్ళబుచ్చారు. మండల అభివృద్ధి పేరుతో గత ప్రభుత్వంలో రొడ్ల వెడల్పు సందర్భంగా బస్ షెల్టర్ తొలగించారని త్వరలోనే మరో షెల్టర్ ఏర్పారుచేస్తామని చెప్పి సంవత్సరాలు గడిచాయని గత ప్రభుత్వం పోయి ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని వారు గుర్తు చేశారు. షెల్టర్ ఏర్పాటు మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని దీనికంతటికీ కారణం కూటమి నాయకుల మధ్య ఉన్న వైరుధ్యాలు వ్యక్తిగత ప్రాకులాటే కారణమని సోషల్ మీడియాలో రోజువారి కథనాలు వస్తున్నాయని వారు గుర్తు చేశారు. షెల్టర్ లేని కారణంగా భక్తులు, యాత్రికులు టి అంగల్ల దగ్గర పండ్ల బండ్ల దగ్గర పందులు, ఆవులు, కుక్కలు, తాగుబోతులతో ఎండకు వానకు ఇబ్బందులు పడుతూ బక్తితో వచ్చిన వారు ఉసూరుమంటూ తిరుగు ప్రయాణం అవుతున్నారని వారు ఆవేదనవెళ్ళబుచ్చారు. వెంటనే ఎమ్మెల్యే గారు, సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని తాత్కాలిక బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో భిక్షాటన ద్వారానైన బస్సు షెల్టర్ ఏర్పాటు చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సాన గోవిందస్వామి, రెబ్బా నరసింహులు, రాహుల్, భాస్కర్, ఆంజనేయులు అరవింద్, దేవా గుర్రయ్య, రమణ,కేశవ, శ్రీనివాసులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్ పోలీస్ సిబ్బందిని ఘనంగా సన్మానించిన పల్నాడు జిల్లా ఎస్పీ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** పల్నాడు జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పాటు సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన ముగ్గురు పోలీస్ సిబ్బందికి జిల్లా పోలీస్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం ఘన సన్మానం నిర్వహించారు. జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు, ఇతర అధికారులు, సిబ్బంది , కుటుంబ సభ్యుల సమక్షంలో రిటైర్ అయిన వారికి పూలమాలలు వేసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం వారు సుదీర్ఘకాలం అంకిత భావంతో సేవలందించారని ప్రశంసించారు.

“మీ సేవలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయి. భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా ఉంటాయి” అని పేర్కొన్నారు. రిటైర్ అయిన వారిలో ఏ ఎస్ ఐ జే. రాములు ఆర్. కరుణామృతరావు , పి. కృపానిధి అనేక సంవత్సరాలుగా పోలీస్ శాఖలో సేవలందించారు. వీరు వివిధ హోదాల్లో పలు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించి మంచి గుర్తింపు పొందారు. పోలీస్ అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించడంలో కుటుంబ సభ్యుల సహకారం కీలకమని ఎస్పీ పేర్కొన్నారు. రిటైర్ అయిన అధికారులకు, వారి కుటుంబాలకు ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) జేవీ సంతోష్, అదనపు ఎస్పీ (క్రైమ్) సి. హెచ్. లక్ష్మీపతి, అదనపు ఎస్పీ (ఏ ఆర్) వి. సత్తిబాబు, డీఎస్పీ మహాత్మా గాంధీ రెడ్డి, హోంగార్డ్ ఆర్ ఐ ఎస్. కృష్ణ, వెల్ఫేర్ ఆర్ ఐ ఎల్. గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనుల ప్రారంభం



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరిలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉద్యానవనాలు, సీ అండ్ డీ వేస్ట్ ప్లాంట్ , ఆర్ఆర్ఆర్ కేంద్రాలను మంగళవారం ఉదయం గుంటూరు టీడీపీ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, తితిదే పాలకమండలి సభ్యురాలు తమ్మి శెట్టి జానకీదేవి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి,నగర కమిషనర్ అలీం బాషా ప్రారంభించారు. మంగళగిరి బ్యాంకు కాలనీ లో రూ. 15.50 లక్షల అంచనా వ్యయంతో వేములపల్లి శ్రీకృష్ణ మున్సిపల్ పార్క్‌ను, టిప్పర్ల బజారులోని ఏపీజే అబ్దుల్ కలాం పార్క్ లను ప్రజలు వినియోగించుకునే విధంగా అందుబాటులోకి తెచ్చారు. తాడేపల్లి మండలం కొలనుకొండలో రూ. 5.50 లక్ష లతో చేపట్టిన సీఅండ్ వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సంకా బాలాజీ గుప్తా, గాజుల శ్రీనివాసరావు, ఎన్టీఎంసీ మేనేజర్ శ్రీనివాసరావు, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రేపు మండల సర్వసభ్య సమావేశం



**బ్రహ్మంగారి మఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** మండలంలో ఉన్న గ్రామాల వారీగా ప్రజా సమస్యలపై ఏప్రిల్ రెండో తేదీన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్ణయించడం జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి రామచంద్ర రెడ్డి పేర్కొన్నారు మండలంలో ఉన్న 14 సచివాల వారిగా ఆ గ్రామాల సమస్యలపై మండల సర్వసభ్య సమావేశాన్ని మండల ప్రజా ప్రతినిధులు మండల స్థాయి అధికారులతో రెండో తేదీ గురువారం ఉదయం 10 గంటలకు ప్రజా పరిషత్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహిస్తారని ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరవుతున్న మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు వీరనారాయణరెడ్డి మండల జడ్పిటిసి సభ్యులు మరియు జిల్లా పరిషత్ చైర్మన్ ముత్యాల రామ గోవిందరెడ్డి తోపాటు మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ మండల స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు తప్పనిసరి హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో రెవిన్యూ మరియు పౌరసరఫరాల శాఖ, వ్యవసాయం మరియు ఉద్యాన వన శాఖ, తాగునీటి మరియు పారిశుద్ధ పనులు పైన, వైద్యము, మరియు ఆరోగ్యం శాఖ, పశు సంవర్ధకశాఖ, వెలుగు పథకం, శ్రీ మరియు శిశు సంక్షేమ అభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, విద్యుత్ శాఖ, విద్యాశాఖ, రహదారులు మరియు భవన నిర్మాణ శాఖ, మైనర్ ఇరిగేషన్ శాఖ, ఇరిగేషన్ డిపార్ట్మెంట్, ఎక్సేంజ్ శాఖ, దేవదాయ శాఖ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, రవాణా శాఖ, మత్స్యకార శాఖ, అటవీ శాఖ, శాఖల వారిగా ఆ అధికారులతో సమీక్ష సమావేశం ఉంటుందని ఈ సమావేశానికి స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులతో పాటు ఆ శాఖ అధికారులు తప్పనిసరి హాజరుకావాలని ఆయన తెలిపారు.

## నెక్కల్లు గ్రామంలో ఇంటింటికీ కుళాయిలకు చర్యలు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :నెక్కల్లు గ్రామంలో ఇంటింటికీ కుళాయిలకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె. కళ్యాణ చక్రవర్తి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నెక్కల్లు గ్రామానికి, తాడికొండ, మరో ఆరు గ్రామాలకు సమగ్ర రక్షిత మంచినీటి పథకం ద్వారా మంచినీటి సరఫరా జరుగుతోందన్నారు.

నెక్కల్లు గ్రామంలో అన్ని వీధులకు పైపులైన్లు లేకపోవడం వలని ప్రస్తుతం వీధి కుళాయిల ద్వారా, చేతిపంపుల ద్వారా త్రాగునీరు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఇటీవల జరిగిన ప్రత్యేక గ్రామ సభలో మంత్రి, శాసన సభ్యులు దృష్టికి తాగు నీటి సమస్య తీసుకురాగా, సి. ఆర్. డి. ఏ ఆధ్వర్యంలో నెక్కల్లు గ్రామానికి బోర్లు, పైపులైన్లు వేయుటకు ఒక కంపెనీకి పనులు అప్పజెప్పడం జరిగిందన్నారు. కంపెనీ త్వరితగతిన పనులు పూర్తి చేసి ఇంటింటికీ కుళాయి కనెక్షను ద్వారా త్రాగు నీరు అందించుటకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. అనంతవరం గ్రామంలో ఒక బోరు వెల్ తో పీ. డబ్ల్యూ. ఎస్ పథకం ఉందని, అందులో రెండు 60 వేల సామర్థ్యం గల ఓ. హెచ్. ఎస్. ఆర్ లు, పాక్షిక పైపులైను ఉందన్నారు. ఇటీవల సి. ఆర్. డి. ఏ వడ్డమాను రోడ్డు ప్రక్కగల కాలనీలో ఒక బోరెవెల్, మోటర్ ఏర్పాటు చేసిందని, గ్రామంలో తాగునీటి సమస్య లేదని వివరణ ఇచ్చారు. త్రాగునీటి బోర్లు, పైపులైను పనులు అవసరమైన మేరకు గ్రామీణ నీటి సరఫరా విభాగం సాంకేతిక సహాయంతో సి. ఆర్. డి. ఏ ద్వారా చేపట్టడం జరుగుతోందని వివరించారు.

## అంగన్వాడి సహాయకురాలు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

○ ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ ముంతాజ్ బేగం

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** ఐసిడిఎస్ బ్రహ్మంగారిమఠం పరిధిలోని మండల పరిధిలో 1) నరసన్న పల్లె (హెచ్ డబ్ల్యు )అంగన్వాడి సహాయకురాలు ( ఆయా )పోస్ట్ 1- ఓసి ఈ పోస్టుకు ఎవరైనా అప్లై చేసుకోవచ్చు. 2) గోడ్లవీడు అంగన్వాడి సహాయకురాలు పోస్టు 1- ఎస్సీ మాదిగ. 3) పీ.సీ పల్లె అంగన్వాడి సహాయకురాలు పోస్టు 1- ఎస్టి. పైన తెలిపిన ఖాళీలు భర్తీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారము భర్తీ చేయబడునని తెలిపారు.

ఈ పోస్టులకు దరఖాస్తు చేయదలచిన వారు పదవ తరగతి తప్పనిసరిగా పాసై ఉండవలెను. దరఖాస్తు చేయు తేదీ నాటికి 18 సంవత్సరాల నుండి 35 సంవత్సరం లోపు ఉండవలెను. 29 వ తేదీ నుండి 13 ఏప్రిల్ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు చాపాడులోని ఐసిడిఎస్ కార్యాలయం నందు స్వీకరించబడునని చాపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ ముంతాజ్ బేగం తెలియజేశారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి



○ మన్నవ మోహన కృష్ణ వెల్లడి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :గుంటూరు కిట్స్ కళాశాలలో మంగళవారం జరిగిన "యువ 2 కే26" కార్యక్రమంలో ఐ.జి ఆకే రవికృష్ణ తో కలిసి ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహన కృష్ణ మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యా ప్రమాణాలతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న కిట్స్ యాజమాన్యాన్ని అభినందించారు. క్వాంటం వ్యాలీ, ఐటీ, సెమీకండక్టర్ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం కల్పించబోయే లక్షలాది ఉద్యోగ అవకాశాలను విద్యార్థులు అందుకోవాలని పిలుపునిచ్చారు. గూగుల్ వంటి సంస్థలు ఏఐ తో దూసుకుపోతున్న తరుణంలో, విద్యార్థులు కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా నూతన ఆవిష్కరణలతో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు. అలాగే ప్రతి ఏటా ఏపీటీఎస్ ద్వారా నిర్వహించే సైబర్ సెక్యూరిటీ హ్యాకథాన్లలో పాల్గొని ఉచిత శిక్షణ, ఇంటర్న్‌షిప్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు మన్నవ మోహన కృష్ణ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కిట్స్ కాలేజ్ ఛైర్మన్ డాక్టర్ కోయ సుబ్బారావు , కిట్స్ కాలేజ్ సెక్రటరీ కోయ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేసిన ఎమ్మెల్యే చదలవాడ

○ ఎస్పీ కార్యాలయానికి చేరుకున్న జిల్లా తెదేపా అధ్యక్షుడు, పెదకూరపాడు ఎమ్మెల్యే

○ ఎమ్మెల్యేను సముదాయించిన పోలీసు ఉన్నతాధికారులు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎమ్మెల్యే అరవింద్ బాబు మంగళవారం నిరసన. వ్యక్తం చేశారు. లాయర్లతో కలిసి ఎస్పీ కార్యాలయానికి ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు. చేరుకున్నారు. జిల్లా ఎస్పి ఆఫీస్ లీగల్ అడ్వైజర్ పోస్టింగ్ విషయంపై ఎస్పితో చర్చలు జరిపినట్లు తెలిసింది.

లీగల్ అడ్వైజర్ పోస్టింగ్ అంశం తమ దృష్టిలో ఉందని ఎమ్మెల్యేకి ఎస్పి చెప్పారు. పోస్టింగ్ భర్తీలో తీవ్ర జాప్యం జరుగుతోందని 8 నెలలుగా తమను కార్యాలయానికి తిప్పుకుంటున్నారని ఎమ్మెల్యే చదలవాడ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎస్పి ఆఫీస్ లీగల్ సెల్ అడ్వైజర్ పోస్టింగ్ విషయంలో ఎస్పికి ఎమ్మెల్యేకి మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం.

ఎస్పి తీరు పై తీవ్ర ఎమ్మెల్యే అరవింద బాబు, లాయర్లు. తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఎస్పి ఆఫీస్ లో ఎమ్మెల్యే ఉండగానే ఎస్పీ క్యాంపు కార్యాలయానికి వెళ్లిపోయిన నట్లు వినికిడి. దీనిపై నిరసన వ్యక్తం చేస్తూ నాలుగు గంటల నుంచి ఎస్పి కార్యాలయంలోనే ఎమ్మెల్యే అరవింద బాబు ఉన్నట్లు సమాచారం.

మొత్తం ఘటనపై రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆరా తీశారు. పల్లా శ్రీనివాసరావు ఆదేశాలతో ఎస్పి ఆఫీస్ వద్దకు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జానీ సైదా, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి చేరుకున్నారు. ఎస్పీ ఆఫీసులో భైటాయించిన అరవిందబాబుకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

# పోలీస్ విభాగాల పనితీరుపై ఎస్పీ సమీక్ష



○ క్రమశిక్షణ, నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)**:జిల్లా పోలీస్ కార్యాలయంలోని హెడ్‌క్వార్టర్స్ విభాగాలను ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం సమీక్షించారు. విధుల నిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ నాణ్యతను పెంచాలని అధికారులకు సూచించారు.

మోటార్ సెక్షన్, ఆయుధాల విభాగం, డాగ్ స్క్వాడ్, యూనిట్ హాస్పిటల్, పోలీస్ క్యాంటీన్, కమ్యూనికేషన్ వింగ్, టైలరింగ్ సెక్షన్‌లను పరిశీలించి అక్కడి పరిస్థితులను ఆరా తీశారు. శుభ్రత, నిర్వహణలో మెరుగులు దిద్దాలని, వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు.

ఆయుధాల సంరక్షణలో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని, ఎస్కార్ట్, గార్డ్ డ్యూటీల్లో అప్రమత్తత అవసరమని స్పష్టం చేశారు. నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమని హెచ్చరించారు.

డాగ్ స్క్వాడ్ సామర్థ్యాన్ని పెంచేందుకు తగిన శిక్షణలు అందించాలని, యూనిట్ హాస్పిటల్‌లో మెరుగైన వైద్య సేవలు కల్పించాలని సూచించారు. క్యాంటీన్‌లో నాణ్యమైన ఆహారం సరసమైన ధరలకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన సమాచార మార్పిడికి కమ్యూనికేషన్ వింగ్ కీలకమని, దీనిని సాంకేతికంగా బలోపేతం చేయాలని ఆదేశించారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తేనే పోలీస్ వ్యవస్థ సమర్థవంతంగా సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు జి.వి. రమణమూర్తి, ఏ. హనుమంతు, డీఎస్పీ సంకురయ్య, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ ఎస్టిమేషన్ కమిటీ సభ్యుడిగా కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి ఏకగ్రీవం



**బ్రహ్మంగారి మఠం (జర్నలిస్ట్ ఫైల్ )**: కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి పార్లమెంట్ ఎస్టిమేషన్ కమిటీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ మేరకు సోమవారం సాయంత్రం పార్లమెంట్లో బులిటెన్ విడుదల చేశారు. పార్లమెంట్ ద్వారా అభివృద్ధి కోసం చేసే ఖర్చు సంబంధిత వివరాలను కమిటీ సభ్యులు పరిశీలిస్తారని వెల్లడించారు. అంటూ మైదుకూరు నియోజకవర్గం వైసీపీ విద్యార్థి విభాగం అధ్యక్షులు భూమిరెడ్డి బాలకృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు

# విజయవాడలో 64 యోగిని చిత్రాల ప్రదర్శన అద్భుతః మంత్రి కందుల దుర్గేష్

○ ఏకా - ది వన్ జాతీయ స్థాయి సంచార చిత్ర ప్రదర్శనపై మంత్రి కందుల దుర్గేష్ ప్రశంసలు



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్)** : విజయవాడ ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో (చుక్కపల్లి పిచ్చయ్య ఆడిటోరియం) ఏర్పాటు చేసిన "ఏకా – ది వన్" జాతీయ స్థాయి సంచార చిత్ర ప్రదర్శనను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం సందర్శించారు. ప్రముఖ కళాకారిణి డాక్టర్ బీనా ఉన్నికృష్ణన్ రూపొందించిన 64 యోగిని చిత్రాలను ఆయన ఆసక్తిగా తిలకించి వాటి ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రదర్శనలో ప్రధాన ఆకర్షణగా నిలిచిన 'వారాహి' యోగిని చిత్రపటాన్ని మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వాహనం పేరు కూడా 'వారాహి' కావడంతో, ఈ చిత్రపటం పట్ల సహజంగానే అందరిలో ఆసక్తి నెలకొందన్నారు. "వారాహి అమ్మవారు భయాన్ని, పరధ్యానాన్ని ఛేదించే ఒక గొప్ప రక్షక శక్తి. ఆమె అచంచలమైన ధైర్యానికి, స్పష్టతకు నిదర్శనమన్నారు. "లక్ష్య సాధనలో వారాహి చూపించే ఏకాగ్రత, ప్రతికూలతలను ఎదుర్కొనే తీరును ఈ చిత్రంలో అత్యద్భుతంగా ఆవిష్కరించారని కొనియాడారు. అదే విధంగా మిగితా కళాఖండాలపై మంత్రి దుర్గేష్ ప్రశంసలు కురిపించారు. భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాన్ని, తంత్ర విద్యలోని లోతును నేటి తరానికి పరిచయం చేసేలా ఈ ప్రదర్శన ఉందని మంత్రి కొనియాడారు. ప్రపంచంలోనే ఒకే కళాకారిణి 64 మంది యోగినీలను పూర్తిస్థాయి సమకాలీన చిత్రాలుగా రూపొందించడం ఇదే మొదటిసారి అని ఆయన అన్నారు.. ప్రతి యోగిని స్వరూపం ఒక విశిష్టమైన స్త్రీ శక్తికి ప్రతిరూపమని, సమాజంలోని చెడును కడిగివేసే సందేశం ఈ చిత్రాల్లో ఉందని పేర్కొన్నారు. కళారంగంలో లింగ వివక్ష లేని సమాజం కోసం, వెనుకబడిన కళాకారుల సాధికారత కోసం కృషి చేస్తున్న డాక్టర్ బీనా ఉన్నికృష్ణన్‌ను మంత్రి దుర్గేష్ అభినందించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక సృజనాత్మక సమితి చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి ఈ చిత్రాల విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా ఆమెను మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు. లోక కళ్యాణార్థం సమాజంలో కుళ్ళను కడిగి వేయడం, సమస్యలు, చెడును అధిగమిచడం తదితర ఉద్దేశ్యంతో మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనను ప్రతి ఒక్కరూ తప్పక సందర్శించాలని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు. ప్రాచీన ఆధ్యాత్మిక సంప్రదాయాన్ని నేటి సామాజిక సంభాషణ లోకి తీసుకువచ్చే ఒక సమకాలీన కళాత్మక వివరణగా మంత్రి దుర్గేష్ అభివర్ణించారు. ఈ సందర్భంగా యోగిని కాళీ, వారాహి, గంగ, కామాక్షి, మహేశ్వరీ, మాతంగి, జాంబవతి, విరాజ, గౌరీ, వరుణి, యమున, నర్మద, తార, చండి, కాత్యాయనీ, మహాలక్ష్మి తదితర అన్ని చిత్రాలను ఆసక్తిగా తిలకించారు.. శక్తి స్వరూపిణీ పాత్రలు పోషించే తీరును ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ గుర్తు చేసుకున్నారు..

ఈ సంచార ప్రదర్శన 16 రాష్ట్రాల్లో, 81 రోజుల పాటు, 10 వేల కిలోమీటర్ల మేర సాగుతుందని కళాకారిణి ఉన్నికృష్ణన్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ఈ ప్రదర్శన జరుగుతున్న 15వ రాష్ట్రమన్నారు. మంత్రి కందుల దుర్గేష్ ఈ ప్రదర్శనకు వచ్చి తన విలువైన సందేశాన్ని ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర సాంస్కృతిక, సృజనాత్మక సమితి చైర్ పర్సన్ పాల్గొన్నారు.

# నిర్మల ఫార్మసీ కాలేజీలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

○ హెటిరో ల్యాబ్స్ ఆధ్వర్యంలో నిర్వహణ



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్)**:మంగళగిరి సమీపంలోని ఆత్మకూరులో ఉన్న నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ప్రముఖ ఔషధ తయారీ సంస్థ హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ సోమవారం విజయవంతంగా నిర్వహించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి మంచి ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. పాముల రెడ్డి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

హెటిరో ల్యాబొరేటరీస్ సంస్థకు చెందిన హ్యూమన్ రిసోర్సెస్ ప్రతినిధి కె. సమీర్ పాల్గొని సంస్థలో లభించే ఉద్యోగ అవకాశాలు, బాధ్యతలు, వేతన విధానం, విద్యార్హతలు, సెలవుల విధానం గురించి వివరించారు. అర్హత సాధించిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. రాబోయే 10 రోజుల్లో క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అసురెన్స్, ప్రొడక్షన్ విభాగాలకు సంబంధించిన అపాయింట్‌మెంట్ లెటర్లను మెయిల్ ద్వారా పంపనున్నట్లు వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు ఖాజిపల్లి, బొంతపల్లి, చౌటప్పల్ యూనిట్లలో నియామకాలు కల్పించనున్నట్లు తెలిపారు.

కార్యక్రమానికి స్వాగత ప్రసంగాన్ని ఎం. ప్రశాంతి అందించారు. ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో మొత్తం 150 మంది బి.ఫార్మసీ, బి.ఎస్‌సీ విద్యార్థులు పాల్గొన్నారు. పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ఈ కార్యక్రమం ఉపయోగకరంగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ప్లేస్‌మెంట్ టీమ్ సభ్యులు ఎం. ప్రశాంతి, వి. జోజిబాబు, సి. హెచ్. భర్గవ గోపి సమన్వయం చేశారు.

# తిరుప్పత్తూర్ సీటు బీజేపీకి - ఎన్‌డీఏ వ్యూహ చర్చలు



**నేషనల్ డెస్క్(జర్నలిస్ట్ ఫైల్)**:ఎన్‌డీఏ పొత్తులో భాగంగా తిరుప్పత్తూర్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని బీజేపీకి కేటాయించినట్లు ఆ పార్టీ తిరుప్పత్తూర్ ఎన్నికల ఇన్‌చార్జ్ కొక్కెర శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

శివగంగై జిల్లా కేంద్రంలో అన్నాడీఎంకే కీలక నేత, జిల్లా కార్యదర్శి, మాజీ ఎంపీ, ప్రస్తుతం ఎన్‌డీఏ అభ్యర్థి సెంథిల్ నాథన్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు చెప్పారు. తిరుప్పత్తూర్ నియోజకవర్గం కూడా ఇదే జిల్లా పరిధిలో ఉండటంతో మిత్రపక్షాల సమన్వయం కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మిత్రపక్షాల ఓట్లను బీజేపీకి బదలాయించే విధానం, ఓట్ల పోలరైజేషన్, అసెంబ్లీ ఎన్నికల సమగ్ర వ్యూహంపై సుదీర్ఘంగా చర్చించినట్లు వెల్లడించారు. తమిళనాడులో జిల్లా కార్యదర్శి బాధ్యతకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, అలాంటి నాయకత్వంతో కలిసి పనిచేయడం ఎన్‌డీఏ బలాన్ని పెంచుతుందని అన్నారు.

సమావేశంలో సెంథిల్ నాథన్ శ్రీనివాస్ యాదవ్‌ను దుశ్శాలువతో సత్కరించగా, పరస్పరం అభినందనలు తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, అసెంబ్లీ ఇన్‌చార్జ్ గణేశన్, రాష్ట్ర సైనిక సెల్ కన్వీనర్ రామన్ తదితరులు పాల్గొన్నారు.

# జీజీహెచ్‌లో త్వరలో ఫెర్టిలిటీ సేవలు

○ జీజీహెచ్ వైద్య చరిత్రలో ఇదొక మైలురాయి

○ కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్య విభాగం బలోపేతం

○ గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)**:
గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్య చరిత్రలో ఫెర్టిలిటీ విభాగం ఏర్పాటు మైలురాయిగా నిలుస్తుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఫెర్టిలిటీ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే నసీర్ మంగళవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు అన్ని జిల్లాలకు వైద్య రంగంలో అత్యంత విలువైన సేవలు అందిస్తున్న గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి పేదలకు వరంగా మారిందని చెప్పారు. దేశంలో జనాభా అత్యంత విలువైన ఆస్తి అని, మ్యాన్ పవర్ దేశ శక్తిని మార్చగలుగుతుందని అన్నారు. ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ఒత్తిడి కారణంగా స్త్రీ, పురుషుల్లోనూ సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుందని, ఈ కారణంగా ఫెర్టిలిటీకి అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తుందని చెప్పారు ఇలాంటి గొప్ప సేవలను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికే కోట్ల రూపాయలతో జింఖానా సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మాతా శిశు సంక్షేమ విభాగాన్ని ఏర్పాటు చేసిందని, దీని ద్వారా 600 పడకల సామర్థ్యం గల అత్యంత విలువైన సేవలు అందించబోతుందని వివరించారు. ఇప్పుడు సర్టిఫిలిటీ వైద్య సేవల ద్వారా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిని మరింత బలోపేతం చేయబోతున్నామని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నామని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు.

# బీజేపీ కార్యాలయంలో మహావీర జయంతి వేడుకలు



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్)**:భగవాన్ మహావీరుని 2625వ జన్మ కళ్యాణక్ సందర్భంగా బీజేపీ ఎన్టీఆర్ జిల్లా కార్యాలయంలో ప్రత్యేక వేడుకలు ఘనంగా నిర్వహించారు. అహింస, ప్రేమ, శాంతి మార్గదర్శకుడైన మహావీరుని బోధనలను స్మరిస్తూ కార్యక్రమం జరిగింది.

బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా సూచనల మేరకు నిర్వహించిన ఈ వేడుకలకు జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షుడు మీరా వలీ ఆధ్వర్యం వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ మహావీరుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమాన్ని గవర్నర్‌పేట మండల అధ్యక్షుడు ప్రవీణ్ జైన్ రాంకా సమన్వయపరిచారు. జైన్ సమాజానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని మహావీరుని సిద్ధాంతాల ప్రాముఖ్యతను వివరించారు. పన్నాలాల్ జైన్, అశోక్ కుమార్ భేర్మల్, అశోక్ జైన్, నరేష్ జైన్, సుభాష్ సాలేచా తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సమాజంలో శాంతి, సోదరభావం పెంపొందించడంలో మహావీరుని 'జీవించు–జీవించనివ్వు' సూత్రం నేటికీ ప్రాసంగికమని పేర్కొన్నారు. అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ అహింసా మార్గంలో నడుస్తూ సమాజ సేవకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మైనారిటీ మోర్చా ప్రతినిధులు, వివిధ విభాగాల బాధ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్‌టీఆర్ జిల్లాలో బీజేపీ మహిళా మోర్చా కమిటీ ప్రమాణ స్వీకారం



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్)**: భారతీయ జనతా పార్టీ ఎన్‌టీఆర్ జిల్లా మహిళా మోర్చా కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిషితా రాజు ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు ఎంవీకే పద్మజ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అడ్డూరి శ్రీరామ్, ఎంవీకే పద్మజలు అందజేశారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

ఈ సందర్భంగా అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు. గిరిజన మహిళను దేశ రాష్ట్రపతిగా, సాధారణ మహిళా కార్యకర్తను కేంద్ర ఆర్థిక మంత్రిగా నియమించడం మహిళల పట్ల ఆయనకు ఉన్న గౌరవాన్ని చాటుతుందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు ప్రోత్సాహం అందిస్తున్న ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మహిళా మోర్చా నాయకులకు శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన, రాబోయే స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ప్రతి నాయకురాలు కష్టపడి పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

# ఎస్ఆర్ఎంలో ప్రపంచ సామరస్య వేడుకలు

○ నృత్యాలతో అదరగొట్టిన విదేశీ విద్యార్థులు




**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్)**:ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో మంగళవారం ప్రపంచ సామరస్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. విదేశీ విద్యార్థుల మధ్య సోదరభావాన్ని, సంఘటితాన్ని బలపరిచే లక్ష్యంతో యూనివర్సిటీ ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ హయ్యర్ స్టడీస్ విభాగం వేడుకలతో కూడిన పండుగను తొలిసారి ఏర్పాటు చేసింది. ఇంటర్నేషనల్ విద్యార్థులతో కలిసి యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ జ్యోతి ప్రజ్వలన గావించి వేడుకల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐఆర్ హెచ్ఎస్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీనరసింహన్ గ్లోబల్ ఫెస్టివల్ ఆఫ్ హార్మోని ప్రత్యేకతను వివరించి, కార్యక్రమానికి హాజరైన అతిథులు, విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ఆచార్య సతీష్ కుమార్ దేశ, విదేశ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు ఏ దేశం వారైనప్పటికీ, విశ్వవిద్యాలయంలో మాత్రం ఎస్ఆర్ఎం విద్యార్థులే అన్నారు. యూనివర్సిటీ ప్రాంగణంలో విద్యార్థులందరి మధ్యా సోదరభావం పెరిగి అంతర్జాతీయ ప్రమాణాలకు ధీటుగా ఫలితాలు సాధించాలని కోరారు. విద్యార్థుల మధ్య సామరస్యత పెంచే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ తరహా వేడుకలు విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతాయని అభిప్రాయపడ్డారు.

**అలరించిన నృత్యాలు......**

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకల్లో వివిధ దేశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వారి వారి సంస్కృతులకు అనుగుణంగా నృత్యాలను ప్రదర్శించారు. శ్రీలంక, నేపాల్, కువైట్, దుబాయ్ ఆఫ్రికా, దేశాల విద్యార్థులు అందరం ఒక్కటే అన్న భావనతో ప్రదర్శించిన నృత్యం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కల్చరల్ వాక్, క్రీడల పోటీలు, షార్ట్ఫిల్మ్ పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

వివిధ దేశాల విద్యార్థులు వారి వారి సంస్కృతులు,అభిరుచులకు అనుగుణంగా వస్త్ర ధారణ చేసుకుని వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో ఐఆర్హెచ్ఎస్ డైరెక్టర్ లక్ష్మీనరసింహన్, అసోసియేట్ డైరెక్టర్ సుదర్శన్, వికాస్ భరద్వాజ్, భావన దీప, స్టూడెంట్స్ అఫైర్స్ అసోసియేట్ డైరెక్టర్ రేవతి, తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467